ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 24.0

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

■ లోపలి పేజీలో..





ఉత్తమ అధ్యాపకులు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ల చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులు అందుకుంటున్న డాక్టర్ నారబోయిన సాంబశివరావు (ఆగిరిపల్లి ఎన్‌ఆర్‌ఐ కాలేజీ), ఎ.జ్యోత్స్నాదేవి (నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల), డాక్టర్ మంగళగిరి హరిప్రసాద్ (కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల)





ఉత్తమ ఉపాధ్యాయులు

సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ల చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న తేరా ప్రసాద్, గుర్రం గంగాధరరావు, షేక్ ఉస్మాన్ పాషా.

ఘనంగా గురుపూజోత్సవం



ఏలూరులోని జడ్పీ మీటింగ్ హాలులో జిల్లావిద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి, జేసీ ధాత్రిరెడ్డి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్, జడ్పీ సీఈవో శ్రీహరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

■ లోపలి పేజీలో..

వేగంగా పోలవరం పునరావాసం

- మొదటి దశ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సిద్ధం!
- కమిషనరేట్‌కు చేరిన 32 గ్రామాల జాబితా.. సిద్ధమవుతున్న మరో 12 గ్రామాల వివరాలు
- పునరావాస కాలనీల నిర్మాణానికి కొత్తగా టెండర్లు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు మొదటి దశ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు వేగవంతమైంది. పెండింగ్‌లో ఉన్న 44 గ్రామాలకు సంబంధించిన ప్యాకేజీలో 31 గ్రామాల లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ ఆమోదానికి పంపారు. మరో 12 గ్రామాలకు సంబంధించిన నివేదికను 15 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. పునరావాస కాలనీల నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. దీనిలోభాగంగా పాత కాంట్రాక్టర్లను నిలిపివేసి, కొత్తగా టెండర్లు పిలిచి, ఖరారు చేయాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేస్తున్నారు. గత వైసీపీ కాలంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్యాకేజీ పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి దశ ప్యాకేజీని 1ఏ, 1బీగా విభజించి అమలు చేస్తున్నారు. ముంపు గ్రామాల్లో మొత్తం 38,060 కుటుంబాలు ఉన్నాయి. దీనిలో మొదటి దశ 1ఏలో (మిగతా 8వ పేజీలో)

నిలకడగా గోదావరి నీటిమట్టం

పోలవరం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు పెరిగిన గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి నిలకడగా మారింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,24,645 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42.00 మీటర్లకు తగ్గింది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.320 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.730 మీటర్లు నమోదైనట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునగడంతో గేట్లు మూసుకుపోయి ఏటిగట్టు కుడివైపున ఉన్న కొండవాగుల జలాలలో పంటపొలాలు నీటమునిగి ఉన్నాయి.

2,10,500

జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేగవంతంగా జరుగుతోంది. జిల్లాలో మొత్తం 6,14,646 రేషన్ కార్డులుండగా 2,10,500 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ జరిగింది. జిల్లాలో ఇప్పటివరకు 33 శాతం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసినట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ నివేదికలు చెబుతున్నాయి. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నారు.

- జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేగవంతం..33 శాతం అందజేత
- నేటి నుంచి 15 వరకు డీలర్ల ద్వారా ఇంటింటికీ..
- 16 నుంచి 20వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది జారీ
- రేషన్ డిపోలకు ఆండ్రాయిడ్ ఈ-పోస్ మిషన్లు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1123 రేషన్ డిపోలుండగా ఒక్కొక్క రేషన్ డిపోకి ఒక సచివాలయ ఉద్యోగిని కేటాయించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జిల్లాలో ప్రారంభించగా మొదటి ఐదు రోజులు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఈనెల 6వతేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపు డీలర్లు ఈ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఆ తర్వాత మిగిలిన స్మార్ట్ రేషన్ కార్డులను తిరిగి 16 నుంచి 20 వరకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తారు.



ఏలూరులో ఇంటింటికి తిరిగి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న వీఆర్వో కావ్య

జిల్లాలో చాలాచోట్ల ఈ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారు. జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. గతంలో ఇచ్చిన రైస్ కార్డులతో పోలిస్తే ఈ కొత్త కార్డులు బాగున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు.

ఆండ్రాయిట్ ఈ -పోస్ మిషన్

ఇప్పటివరకు రేషన్ డీలర్లు వినియోగిస్తున్న ఈ-పోస్ మిషన్లు స్థానే కొత్తగా కొత్త వెర్షన్‌తో ఆధునీకరించిన (మిగతా 8వ పేజీలో)

సజావుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

జిల్లాలో స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ సజావుగా సాగుతోంది. ఇప్పటివరకు గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఈ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 33 శాతం కార్డుల పంపిణీ పూర్తి అయింది. ఇప్పటి వరకు వినియోగిస్తున్న ఈ-పోస్ మిషన్లు స్థానే కొత్తగా ఆండ్రాయిడ్ ఈ-పోస్ మిషన్లు త్వరలో అందు బాటులోకి రానున్నాయి. వాటిని రాగానే రేషన్ డీలర్లుకు అందజేస్తారు.

- ఈబీ విలియమ్స్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి



చిల్లబోయినపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి పార్థసారథి

అర్హులందరికీ స్మార్ట్ రైస్‌కార్డులు

- మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు/ముసునూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పౌరసరఫరాలను పారదర్శకంగా నిర్వహించేందుకు అర్హులైన ప్రతిఒక్కరికి క్యూఆర్ కోడ్ ఆధారిత, స్మార్ట్ రైస్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్టు రాష్ట్ర సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులోను, ముసునూరు మండలం చిల్లబోయినపల్లిలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్మార్ట్‌రేషన్‌కార్డు పంపిణీ ద్వారా ఏ సమయంలోనైనా, ఎక్కడైనా రేషన్ పొందేందుకు వెసులుబాటు కలిగిందన్నారు. రేషన్ పంపిణీని మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించే లక్ష్యంగా పాత కార్డుల స్థానంలో ఈ స్మార్ట్ రైస్ కార్డులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. తహసీల్దార్లు భద్రు, దాసరి ప్రశాంతి, ముసునూరు ఎంపీడీవో బి.ఏ సత్యనారాయణ, చిల్లబోయినపల్లి సర్పంచ్ కందేపు రామగిరి, టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో లోపాలు గుర్తిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ఏలూరుసిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎరువుల సరఫరాలో ఎక్కడైనా లోపాలు జరిగినట్లు గుర్తిస్తే ఏ ఒక్కరినీ వదిలేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. జిల్లాలో ఎరువుల లభ్యత, సరఫరాలపై వ్యవసాయ శాఖాధికారులతో శుక్రవారం కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా అధిక మోతాదులో పంపిణీ చేసిన ఘటనలను గుర్తిస్తే పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు డీలర్ల వద్ద పెద్ద మొత్తంలో యూరియా నిల్వలు లేకుండా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మండల పరిధిలో ప్రస్తుత ఎరువుల నిల్వల వివరాలను మండల వ్యవసాయ శాఖాధికారి వారీగా ఆరా తీశారు. వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, డీసీవో శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖాధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో సందేహాల నివృత్తికి కంట్రోల్ రూమ్

జిల్లాలో యూరియా పంపిణీ రైతుల సందేహాల నివృత్తి కోసం ఏలూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు యూరియా పంపిణీకి సంబంధించిన సమాచారంతో పాటు వ్యవసాయ సంబంధిత సందేహాలను నివృత్తి చేసుకోవ డానికి 85004 21967, 89850 21117 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,647 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంద న్నారు. శుక్రవారం జిల్లాకు మూడు రాక్‌పాయింట్ల ద్వారా 1,220 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందన్నారు. మొత్తంగా జిల్లాలో ప్రస్తుతం 2867 మెట్రిక్ టన్నుల యూరియా అందు బాటులో ఉందన్నారు. రైతులకు ఎరువుల సరఫరాలో ఎటువంటి సమస్య లేదని , రైతులకు సంబంధించి ఏ సమస్యనైనా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని కలెక్టర్ తెలిపారు.

నీటి కష్టాలు..!



సీబీ కెనాల్

సీబీ కెనాల్‌కు అరకొరగానే నీటి విడుదల

- శివారు రైతులకు తప్పని వంతులవారీ కష్టాలు
- పూర్తిస్థాయిలో నిండని చెరువులు
- పట్టని అధికారులు, పాలకులు

కలిదిండి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా గుడ్లవల్లేరు లాకుల వద్ద క్యాంప్ బెల్ కెనాల్ (సీబీ కెనాల్)కు పూర్తి స్థాయిలో సాగు, తాగునీరు విడుదల చేయక పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. సీబీ కెనాల్‌కు 750 క్యూసెక్కుల కృష్ణా జలాలను విడుదల చేయాల్సి ఉండగా 300 నుంచి 400 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రతిసారి ఇరిగేషన్ అధికారులు విడుదల చేయడంతో జిల్లాకు శివారున ఉన్న కలిదిండి మండలానికి సాగు, తాగునీరు తగినంతగా చేరడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్లు ఎత్తి సముద్రంలోని వృథాగా నీటి వదిలేస్తున్నారే గాని సీబీ కెనాల్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయడం లేదని, ఎండిపోతున్న వరి పొలాలను ఎలా కాపాడుకోవాలని వాపోతున్నారు. ఏటా సాగు, తాగునీరు వంతుల వారీగా ఇవ్వడంతో తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోలేకపోతున్నారు.

గట్లను పటిష్ఠం చేయాలి

సీబీ కెనాల్ గట్లు పటిష్ఠంగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు విడుదల చేయలేకపోతున్నామని కొన్నేళ్లుగా ఇరిగేషన్ అధికారులు, పాలకులు చెబుతున్నారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద నుంచి కాకరవాడ వరకు సుమారు ఏడు కిలోమీటర్ల మేర గట్లు బలహీనంగా ఉండటంతో గండ్లు పడే అవకాశం ఉందని వాటిని బలోపేతం చేయాలని పాలకులకు అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గట్లను పటిష్ఠం చేస్తే 750 క్యూసెక్కుల నీరు విడుదల చేసి పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు అందించవచ్చని, వంతుల వారీ విధానానికి స్వస్తి పలక వచ్చని పేర్కొంటున్నారు. సీబీ కెనాల్‌పై అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వంతెనలు నిర్మించడంతో పిల్లర్ల వద్ద డెక్క, తూడు దట్టంగా పేరుకుపోయి సాగు, తాగునీరు శివారు గ్రామాలకు చేరడం లేదు. వాటిని తొలగిస్తే సాగు, తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందని రైతులు అంటున్నారు.

శిథిలమైన లాకులను తొలగించాలి

గుడ్లవల్లేరు లాకుల వద్ద నుంచి సీబీ కెనాల్ కలిదిండి శివారు వరకు సుమారు 38 కిలోమీటర్లు మేర విస్తరించి ఉంది. ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో లక్షలాది ఎకరాలు చెరువులకు ఈ కెనాల్ ద్వారా నీరు సరఫరా అవుతుంది. గుడ్లవల్లేరు లాకుల వద్ద సీబీ కెనాల్‌పై కొత్త లాకులు నిర్మించి శిథిలావస్థలో ఉన్న లాకులను తొలగించకపోవంతో నీటి ప్రవాహానికి అడ్డంకి మారింది. వెంటనే శిథిలావస్థలోని లాకులను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

750 క్యూసెక్కులు విడుదల చేయాలి



సీబీ కెనాల్ గట్లు బలహీనంగా ఉండడంతో ఇరిగేషన్ అధికారులు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయడం లేదు. ప్రతీసారి 300 నుంచి 400 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారు. గట్లు పటిష్ఠం చేసి 750 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే శివారు గ్రామాలకు సాగు, తాగునీరు సమస్య పరిష్కారమవుతుంది.

- అక్కల వెంకటాచలం, రైతు, పెదలంక

ఇబ్బందులు పడుతున్నాం..



గుడ్లవల్లేరు లాకుల వద్ద కొన్ని దశాబ్దాలుగా సీబీ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేయడంతో వంతులవారీ అమలు చేస్తున్నారు. పూర్తిగా వరి పొలాలకు, తాగునీటి చెరువులను నింపలేకపోతున్నాం. నీటిఎద్దడితో వరి పొలాలు ఎండిపోతున్నాయి. సకాలంలో నీటి వంతు ఇవ్వడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం.

- మంతెన సుబ్బరాజు, రైతు, భాస్కరరావుపేట

ముగ్గురు పిల్లల తండ్రి.. మైనర్‌తో ప్రేమ

- కుటుంబీకులు ఆగ్రహించడంతో బాలికతో సహా ఆత్మహత్య
- భద్రాచలంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో ఘటన
- మృతుడిది కుక్కునూరు మండలం పెదరావిగూడెం



ఎస్.రవి (ఫైల్)

భద్రాచలం/కుక్కునూరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అతడికి వివాహమైంది. భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కానీ తనకు దూరపు బంధువైన ఓ బాలికతో కొన్ని నెలల క్రితం ప్రేమలో పడ్డాడు. ఈ విషయం తెలిసిన అమ్మాయి కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వద్దని వారించారు. అయినా వినలేదు. దీంతో తమ కూతురిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. రిమాండ్‌కు వెళ్లిన అతడు బెయిల్‌పై బయటకొచ్చిన తర్వాతకూడా తీరు మార్చుకోలేదు. తమ ప్రేమకు ఇరు కుటుంబాల వారు అడ్డుపడుతున్నారన్న మనస్తాపంతో ఆ బాలికను ఓ హోటల్‌కు తీసుకొచ్చి.. ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. కుక్కునూరు మండలం పెదరావిగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించే ఎన్.రవి(34).. తనకు దూరపు బంధువైన భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన ఓ బాలిక(16) ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇద్దరూ భద్రాచలం వచ్చారు. కరకట్ట సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ లాడ్జిలో దిగిన ఆ ఇద్దరూ శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఆ సమయంలో గదిలో నుంచి వస్తువులు పడిన శబ్దాలు రావడంతో లాడ్జి సిబ్బంది అప్రమత్తమై తలుపులు తెరిచి అంబులెన్సులో ఇద్దరినీ భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి.. భద్రాచలం పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో రవి వైద్యశాలకు వెళ్లేలోపే మృతి చెందగా.. బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న రవి, బాలిక కుటుంబ సభ్యులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను చూసి విలపించారు. భద్రాచలం సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకున్నారు.

ఫిబ్రవరిలో రవిపై పోక్సో కేసు

రవికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలున్నారు. దూరపు బంధుత్వం ఉన్న బాలికతో ప్రేమలో పడగా.. విషయం తెలిసిన అమ్మాయి కుటుంబ సభ్యులు ఇద్దరినీ వారించారు. అయితే రవి పట్టించుకోకుండా బాలికతో ప్రేమ వ్యవహారం సాగిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులు అశ్వాపురం పోలీసు స్టేషన్‌లో ఫిబ్రవరి 5న ఫిర్యాదు చేయగా.. అతడిపై పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. రిమాండ్ నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం కూడా రవి ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో ఇరు కుటుంబాల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రవి, బాలికతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ నాగరాజు తెలిపారు.

నీటితొట్టెలో పడి చిన్నారి మృతి

ముసునూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటితొట్టెలో పడి ఏడాదిన్నర చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం ముసునూరులో చోటు చేసుకుంది. సగరుల కాలనీకి చెందిన పేరిచర్ల వెంకటేశ్వర రావుకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె గానవి సాయంత్రం ఆడుకుంటూ ప్రమాదవ శాత్తు ఇంటి ఆవరణలో ఉన్న వరల నీటి తొట్టెలో పడిపోయింది. ఆరుబయట తోటి పిల్లలతో తన కుమార్తె ఆడుకుంటోందని ఇంటిలో పనులు చేసుకుంటున్న తల్లి ఈ విషయాన్ని గమనించలేదు. అయితే చీకటి పడినప్పటికీ కుమార్తె ఇంటికి రాకపోవడంతో వెదుకు తుండగా నీటితొట్టెలో తేలుతూ కనిపించింది. కొన ఊపిరితో ఉన్న చిన్నారిని వెంటనే బయ టకు తీసి, స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకు వెళ్లగా, ఆయన ప్రథమ చికిత్స అందించి నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. వైద్యులు పరీక్షించి, చిన్నారి మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. సగరుల కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రేపు ఏలూరులో డాగ్ షో

ఏలూరుక్రైం,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు డాగ్ షో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ ఆదేశాల మేరకు ఈ వినూత్న కార్యక్రమానికి పోలీస్‌శాఖ శ్రీకారం చుట్టింది. పెంపుడు జంతువులు వల్ల వృద్ధులకు, పిల్లలకు, సమాజానికి కలిగే ప్రయోజనాలు, ఉపయోగాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ డాగ్ షోను నిర్వహిస్తున్నారు. జంతుశిక్షణ, వాటి ప్రతిభ, రక్షణలో వాటి పాత్ర, స్నేహపూర్వక లక్షణాలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించనున్నారు. ముఖ్యంగా వృద్ధులకు, ఒంటరితనంతో బాధపడేవారికి, చిన్నపిల్లలకు కలిగే మానసిక స్వాంతన రక్షణ, సాన్నిహిత్యం వంటి లక్షణాలపై ప్రత్యేక అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. జంతు ప్రియులు తమ పెంపుడు కుక్కలతో హాజరుకావాలని పోలీస్ యంత్రాంగం కోరింది.

కార్యదర్శి తీరుపై సర్పంచ్ నిరసన



మండవల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలనలో తనకు కార్యదర్శి రాధిక సహకరించడం లేదని మండవల్లి మండలం ఉనికిలి సర్పంచ్ ఇమ్మడి అన్నమ్మ మండవల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పరిపాలన సాగించడం, జమా ఖర్చులు, అభివృద్ధి పనులపై తనకు సమాచారం లేకుండానే చేస్తున్నారంటూ ఆరోపించారు. ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శిపై చర్యలు తీసుకోకుంటే దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్ సమీప బంధువు అశోక్‌కుమార్ నిరసనకు మద్దతు తెలిపారు.

కనువిందు చేయనున్న రెడ్ మూన్

- రేపు రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం .. మధ్యాహ్నం నుంచి శ్రీవారి ఆలయం మూసివేత

గురుపూజోత్సవానికి సమగ్రశిక్ష దూరం!

ఆహ్వాన పత్రికలో ఏపీసీ పేరులేకపోవడమే కారణమా?

■ లోపలి పేజీలో..



భీమవరంలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగరాణి, వేదికపై రఘురామకృష్ణరాజు, పీతల సుజాత, అధికారులు



ఏలూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే బడేటి చంటి, అధికారులు

గురు దేవోభవ

ఉమ్మడి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

భీమవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కొనియాడారు. జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో శుక్రవారం భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక భవనంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్, ఎమ్మెల్యే అంజిబాబు, రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత, ఎమ్మెల్సీ గోపిమూర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాధికులైన డాక్టర్ సర్వేపల్లి రాష్ట్రపతిగా, ఉప రాష్ట్రపతిగా పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారని రఘురామకృష్ణరాజు ప్రస్తుతించారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రతిఒక్కరూ గురువులను సత్కరించాలని హితవు పలికారు. విద్యార్థులకు మార్గదర్శులుగా, సత్ప్రవర్తన కలిగిన వారుగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొంటున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సామాజికాభివృద్ధికి ఉపాధ్యాయులు మూలస్తంభం. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించి సంఘంలో ఒక గౌరవమైన వ్యక్తిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి అజరామరం అని కలెక్టర్ అన్నారు.

ఎమ్మెల్యే అంజిబాబు, మహిళా సహకార, ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత, ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు తర్వాత సక్రమంగా నడిపించేది ఉపాధ్యాయులే అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించి ఘనంగా సత్కరించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మత్స్యకార సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లి పెద్దిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ పీవై శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా అత్యాధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) క్లాసులు, విద్యార్థులకు అదనపు తర్ఫీదు నిస్తున్న ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలని జేసీ ధాత్రిరెడ్డి పిలుపునిచ్చారు. జడ్పీ మీటింగ్ హాలులో జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ తరగతి గదిలో టీచర్లు బోధించే విధానం విద్యార్థులకు జీవితాంతం గుర్తుంటుందని వివరించారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ భగవంతుని తర్వాత పూజించేది గురువులనేనన్నారు. ఉపాధ్యాయుల బోధనలే సమాజంలో విద్యార్థుల ప్రవర్తనను నిర్ణయిస్తాయన్నారు. గురువులే తన రాజకీయ ఉన్నతికి కారణమని వివరించారు. డీఈవో వెంకటలక్ష్మి మాట్లాడుతూ జీవిత పాఠాలు నేర్పించేది గురువులేనన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి, విద్యారంగానికి ఆయనచేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి హాజరు కాలేక పోయిన కలెక్టర్ వెట్రిసెల్వి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షల సందేశాన్ని పంపారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించే అనిర్వచనీయ పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

33 మందికి పురస్కారాలు

ఈ ఏడాది తొలిసారిగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవడమే అర్హత/ప్రామాణికంగా జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసింది. ఉత్తమ ఉపాధ్యాయ, స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను మొత్తం 33మందికి అందజేసి, వారిని దుశ్శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 15మంది, ఎస్జీటీలు 10 మందిని జిల్లావిద్యాశాఖ ఎంపికచేయగా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం జిల్లాలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపిక చేసిన 5 పాఠశాలల ప్రిన్సిపాల్స్/హెచ్‌ఎంలు, వ్యాయామోపాధ్యాయులతోపాటు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ నుంచి గత రాష్ట్ర స్థాయి ఉత్తమ జూనియర్ లెక్చరర్(సివిక్స్)గా అవార్డుకు ఎంపికై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పురస్కారాన్ని అందుకోలేకపోయిన నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు సీహెచ్ వీవీ.రామచంద్రరావుకు అవార్డును అందజేశారు. వీరితోపాటు ఫెలోషిప్ అవార్డుల విభాగంలో ఎంపికైన కొప్పాక జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఆర్.శైలజ, కొవ్వలి జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎస్ఆర్‌జీవీ.శర్మకు అవార్డులను అందజేశారు. వాస్తవానికి వీరిద్దరినీ తొలుత ఎంపికచేసిన జాబితాలో చేర్చినప్పటికీ వివిధ కారణాలవల్ల గురువారం రాత్రి జిల్లావిద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో పేర్లు లేవు. శుక్రవారం ఉదయం వీరిద్దరికీ ఉత్తమ పురస్కారాలు ఖరారయ్యాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్పీ కేపీఎస్.కిశోర్, జడ్పీ సీఈవో శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ పార్థసారధి, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్.పెదబాబు, డీవైఈవోలు రవీంద్రభారతి, సుధాకర్, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, ఎంఈవోలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ ఆశ, ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా నాయకులు మోహన్, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, నారాయణ, ఆంజనేయులు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


భీమవరం కలెక్టరేట్‌లో అవార్డు అందుకుంటున్న చల్లపల్లి నాగ సత్యసాయి తేతలి, అనూరాధ చిన అమిరం, సూర్యకుమారి చిన మామిడిపల్లి, కె.మునేంద్రరావు, ఆర్.ఇందిర ఆకివీడు


కె.శ్రీనివాసరావు రాయకుదురు, ఉమా మహేశ్వరి ఇల్లింద్రపర్రు, సీహెచ్ వెంకట్రావు పాలకొల్లు, కె.వెంకటేశ్వరరావు బాడవ, ఎం వనజాక్షి భీమవరం


ఎల్‌వీవీఎస్ శర్మ, డీఎస్‌వీ సత్యనారాయణ మాముడూరు, వై శోభారాణి ఆలమూరు, షేక్ సైదునీస్సాసా ఎస్ఎన్ఆర్ పేట, శివ నాగమణి రావిపూడి


ఎండీ అమీర్ నబీల్, వి.సుధాకర్ పెన్నాడ, అవార్డులు అందుకున్న వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు


అవార్డులు అందుకున్న జీవీవీ రామానుజరావు, జి.శ్రీనివాస వర్మ, బి.బంగార్రాజు, జి.శ్రీనివాసరాజు, ఎస్.సూర్యనారాయణ, కె.కామేశ్వరరాజు ఎ.వేమవరం, డి.నరసింహారావు, ఎం.దుర్గాభవాని ఆచంట, ఎఆర్‌వీ ప్రసాదరావు, కె.వెంకటేశ్వరరావు, జి.జయకుమారి, వైవీవీఎస్‌వీ ప్రసాద్, పి.దుర్గారావు, వి.సుమలత, ఐ.ఉదయభాస్కరావు, పీఎస్ఎస్ఎన్ మూర్తి, ఎ.అప్పలరాజు, పి.వి జయశ్రీ, బి.ఉషాదీప్తి, వీఎస్ఎస్ఎల్‌హెచ్ ఆచార్యులు, తోట జాన్సీరాణి, జి.సుధాకర్ పెన్నాడపాలెం, దేగల ధృవిత, జేఎస్‌వీవీ లింగేశ్వరరావు వర్లా తిప్ప, బీవీఎస్ కృష్ణబాబు వెస్ట్ కమతాలపల్లి, వి.శ్రీనివాసపురుషోత్తం ఆకివీడు, జి.రాధాకృష్ణ, ఓ.శ్రీనివాసరావు కాశిపాడు, వి.సాల్మన్‌రాజు మేడవరం, షేక్ సాధిక ఉన్నీసా కటికలవారి పేట, కె.కృష్ణమూర్తి ఎల్ఎన్‌పురం, పి.స్వరూప వెంకటరావు తోట, పి.వెంకటేశ్వరరావు చిలుకూరు, ఎస్‌కె అబ్దుల్లా రేలంగి, ఎస్.బుజ్జి పోడూరు, జె.విజయలక్ష్మి పెనుమంట్ర


అవార్డు అందుకుంటున్న ఆర్.శైలజ కొప్పాక, ఎస్ఎల్‌వీ.శర్మ కొవ్వలి, బత్తుల అనురాధ నూజివీడు, వెల్లటూరి రామ ప్రసాద్ నూజివీడు, నక్కా సరళకుమారి, ఏపూరు


మద్రిపాటి పద్మావతి కలరాయనగూడెం, పంతాగని వీర కోటి, చనుబండ, పంటగాని సోమయ్య, నారాయణపురం, పాలిమెట్ల ప్రేమావతి ఏలూరు, పీపీఎస్ సత్యనారాయణ ధర్మాజీగూడెం


వి.శ్రీనివాసరావు జడ్పీహెచ్ఎస్ రామసింగవరం, జె.రామకృష్ణ, పెదవేగి మండలం, ఎంఎల్‌కే శ్రీనివాసరావు చింతంపల్లి, షేక్ రంగావలి తోకలపల్లి, ఆర్.వెంకట నాంచారయ్య దొద్దిపట్ల


టి.వెంకట అప్పారావు పులిచెరువు, ఎ.అప్పారావు నిడమర్రు, సరళ మహాదేవి స్వర్ణ పాతూరు, సీహెచ్ కుసుమకుమారి చావలిపాడు, ఎం.శ్రీనివాసరావు లింగాల


డీకేఎస్ఎస్ ప్రకాశరావు తిమ్మారావుగూడెం, పి.రాజ్యలక్ష్మి వెలంపాంపేట, డి.గంగమ్మ వేంపాడు, ఎస్.నాగేశ్వరరావు మతంగూడెం, బిఎం.నిర్మలాకుమారి వెంకంపాలెం


ఎ.వెంకటేశ్వరరావు ఈదులగూడెం, ఒ.ఆనంద్‌కుమార్ కాగుపాడు, బెస్ట్ ఎక్సలెన్స్ స్పోర్ట్సు అవార్డులు బీఆర్ అంబేద్కర్ గురుకులం పెదవేగి, సెయింట్ థెరిస్సా ఏలూరు, ఏఆర్‌డీజీకే ఏలూరు


అంబేద్కర్ గురుకులం వట్లూరు, జడ్పీహెచ్ఎస్ ప్లస్ కొవ్వలి, రామచంద్రరావు, లెక్చరర్, నారాయణపురం






భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన గురు పూజోత్సవ కార్యక్రమాల్లో అలరించిన శ్రీకృష్ణుడు, గోపికల నృత్య ప్రదర్శన, జానపద నృత్యం

యూరియాపై విష ప్రచారం తగదు

» 396 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి

» డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ


విలేకరులతో మాట్లాడుతున్న మురళీకృష్ణ

ఏలూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులను భయాందోళనకు గురి చేసేలా యూరియా కొరత ఉందని వైసీపీ ఆధ్వర్యంలో జగన్, నేతలు విష ప్రచారం చేయడం సిగ్గుచేటని డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ ధ్వజమెత్తారు. ఏలూరు డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్యాలెస్‌లో కూర్చొని యూరియా కొరత ఉందని ప్రకటనలు చేయడం తగదని, దమ్ముంటే ప్రజల్లో తిరిగి వాస్తవాలను గమనించాలని చాగంటి కోరారు. జిల్లాలో యూరియా, కాంప్లెక్స్, ఇతర ఎరువుల కొరత ఎక్కడా లేదని తెలిపారు. జిల్లాలో డీసీఎంఎస్ ద్వారా 21 బ్రాంచుల్లో 396 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయన్నారు. వ్యాగన్ ఆలస్యం జరగడం వలనే కొంత జాప్యం జరిగిందని, యూరియా రాగానే తీసుకోవడానికి రైతులు ఎగబడితే దానిపై కొరత అని విషప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. 21 బ్రాంచిలను 40కు విస్తరించి, మరింత ఎరువులను రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.


సీజ్ చేసిన ఎరువుల నిల్వలతో విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ఏలూరు,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో విజిలెన్స్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పలుచోట్ల ఎరువుల దుకాణాలపై శుక్రవారం దాడులు చేశారు. భీమడోలు మండలం గుండుగొలనులో సాయి లలితాంబికా మెన్యూర్ డిపో, సత్యదుర్గా ట్రేడర్స్, పోడూరు మండలం జగన్నాథపురంలో సాయి ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌ను తనిఖీ చేశారు. సాయి లలితాంబికా మెన్యూర్‌లో రూ.7,77,950 విలువైన 26.850 టన్నుల ఎరువుల వ్యత్యాసాన్ని గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సాయి ఫెర్టిలైజర్స్ పెస్టిసైడ్స్‌లో రూ.2,83,183 విలువైన 370.30 కేజీల పురుగుమందులు అనధికారికంగా నిల్వ చేసినట్లు గుర్తించి షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు. దాడుల్లో సీఐ వి.శివరామకృష్ణ, ఏవో జి మీరయ్య, ఎస్ఐలు రంజిత్‌కుమార్, కె.నాగరాజు, కె.సీతారామ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కే.హిమబిందు అన్నారు. తాడేపల్లిగూడెం నిట్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీన్ హిమబిందు మాట్లాడుతూ గురువే విద్యార్థుల జీవితానికి మార్గదర్శి అన్నారు. విద్యార్థులను అజ్ఞానం నుంచి విజ్ఞానం దిశగా నడిపించేది ఒక్క ఉపాధ్యాయుడేనన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్‌లు డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసన్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ అమరేంద్రరెడ్డి, డాక్టర్ పి.కిశోర్, డాక్టర్ ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు రైతాంగానికి మేలు

ఏలూరు ఎంపీ మహేశ్




ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ స్లాబ్‌లో మార్పు వలన రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై మహేశ్ హర్షం వ్యక్తం చేశారు. పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు ధరలు జీఎస్టీ తగ్గింపు వలన రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ రెండు శ్లాబుల విధానంలో వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ ఐదు శాతానికి తగ్గించడం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పురుగు మందుల ధరల కూడా తగ్గుతాయన్నారు. వ్యవసాయ రంగం ఇబ్బందుల్లో ఉన్న తరుణంలో జీఎస్టీ తగ్గించడం పొగాకు కొనుగోళ్లు, పామాయిల్ ధరలు కోకోరైతులకు మేలు జరుగుతుందన్నారు. బీడీ ఆకులపై 15శాంత నుంచి 7శాతానికి జీఎస్టీ తగ్గించడంపై కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

గురుపూజోత్సవానికి సమగ్రశిక్ష దూరం!

ఆహ్వాన పత్రికలో ఏపీసీ పేరులేకపోవడమే కారణమా?

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల అందజేత కార్యక్ర మానికి సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఏపీసీ సహా, మొత్తం కార్యాలయ సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ ఆఫీసర్లు, సిబ్బంది దూరంగా ఉండడం చర్చనీయాం శమైంది. ఈ పరిణామంతో జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు మధ్య సత్సంబంధాలులేవని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి అవార్డుల ప్రదానో త్సవ కార్యక్రమానికి జ్ఞాపికలు, దుశ్శాలువాలు, పూలదండలు, అతిథులకు అల్పాహారం, తదితర ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రూ.లక్ష చొప్పున మంజూరు చేసినా గురువారం రాత్రి వరకు నిధులు విడుదల చేయ లేదు. ఈ నిదులను సమగ్ర శిక్షకు విడుదలచేస్తే వాటిని జిల్లా విద్యాశాఖకు బదిలీచేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం అవార్డుల ఫంక్షన్ నిర్వహణ నిమిత్తం ఎస్ఎస్ఏలో ఒక అధికారి జేబు నుంచి నిదులను జిల్లా విద్యాశాఖకు ఇచ్చినట్టు తెలిసింది. ప్రభుత్వం నుంచి నిదులు విడుదలైన వెంటనే ఆ అధి కారికి విద్యాశాఖ నుంచి ఇప్పించే షరతుపై అందజేశారు. కాగా అవార్డుల ఫంక్షన్‌కు జిల్లా విద్యాశాఖ ముద్రించిన ఆహ్వానపత్రాల్లో ఏపీసీ పేరు లేక పోవడంపై కినుకవహించి పురస్కారాల అందజేత కార్యక్రమానికి సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది అందరూ దూరంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఒకరికొకరు సోదరశాఖల్లా ఉండాల్సిన జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులమధ్య పలుసందర్భాల్లో భిన్నాభిప్రాయాలు, సఖ్యతలేకపోవడం కొంతకాలంగా జరుగు తోందని, తాజాగా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం కూడా ఇదే కోవలోకి వస్తుందని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా సమగ్ర శిక్ష ఏపీసీ వ్యక్తిగత పనిపై వేరే ప్రాంతానికి వెళ్లడం వల్ల గురు పూజోత్సవ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.


ఆవగింజలతో నెహ్రూ రూపం


దోస గింజలపై భగవద్గీత ఆవిష్కరిస్తున్న అంబికా రాజా (ఇన్‌సెట్) దోసగింజలపై లిఖించిన భగవద్గీత

దోస గింజలపై భగవద్గీత

» ఆవాలతో రూపాలు » అబ్బుర పరిచిన మైక్రో ఆర్ట్ ఎగ్జిబిషన్

ఏలూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బియ్యపు గింజలపై పేర్లు రాయడం చిత్రాలు వేయడం చూశాం. అయితే రెండు మిల్లీమీటర్లు ఆవగింజలతో రూపాలు ఆవిష్కరించి ఔరా అనిపించారు రవికుమార్. ఏలూరులో మైక్రో ఆర్ట్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంటోంది. మైక్రో ఆర్ట్ అలసిన మనస్సుకు ప్రశాంతతను ఇస్తుందని, సినీ నిర్మాత అంబికా రాజా పేర్కొన్నారు. ఏలూరు అగ్రహారంలో సాహితీవేత్త ఎంవీఎస్ గురుశర్మ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తూటిపాలకు చెందిన సూక్ష్మ కళాకారుడు బి. రవికుమార్ రూపొందించిన విభిన్న వస్తువులతో మైక్రో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను అంబికా రాజా ప్రారంభించి మాట్లాడారు. రవికుమార్ భగవద్గీతలోని 700 శ్లోకాలు దోస గింజలపై రాశారు. పోస్టుకార్డుపై 80 వేల ఇంగ్లీషు అక్షరాలు రాశారు. ప్రతి వస్తువును కళాఖండంగా తీర్చిదిద్దాడు దివ్యాంగుడైన రవికుమార్. ఆవ, తోటకూర గింజలతో చేసిన రూపాలు తమలపాకు మీద రాసిన హనుమాన్ చాలీసా విశేషంగా ఆకట్టుకున్నాయి. గిన్నిస్‌బుక్‌లో స్థానమే లక్ష్యమని రవికుమార్ తెలిపారు. గురుశర్మ సేకరించిన 6 వేల సాహితీ పుస్తకాలు, 1832 నుంచి సేకరించిన నాణేలు, కరెన్సీ, అతి చిన్న టెంకాయిలు ఆకట్టుకున్నాయి. సూక్ష్మ చిత్రాలను ప్రజలకు చేరువ చేయాలన్నదే లక్ష్యంగా మైక్రో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో 4 బార్లకు 15న లాటరీ

భీమవరం క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భీమవరం మునిసిపాలిటీ పరిధిలో ఓపెన్ కేటగిరిలో భర్తీ కాకుండా మిగిలిన నాలుగు రెస్టారెంట్ అండ్ బార్లను లాటరీ ద్వారా డ్రా తీయడం జరుగుతుందని భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటి నోటిఫికేషన్‌ను విడుదల చేయడం జరిగిందని, ఈ నెల 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. 15వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి కొత్త బార్లను కేటాయించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇతర వివరాల కోసం భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

క్రైస్తవ సంఘాల మధ్య వివాదం



పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక అడబాల గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన తైలాభిషేకం ఆరాధనలను నిలిపివేయాలంటూ స్థానిక తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి, పశ్చిమ గోదావరి జిల్లా పాస్టర్ల అసోసియేషన్, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా నరసాపురం డివిజన్ బ్రాంచ్ పిలుపు మేరకు శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు సనమండ ఎబినైజర్, ఇతర క్రైస్తవ సంఘాల పెద్దలు నాయకత్వం వహించారు. శుక్రవారం తెల్లవారు జామునుంచే ఫంక్షన్ హాల్ వద్ద వందలాది మంది ప్ల కార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. ఈ ఫంక్షన్ హాల్లో ప్రతి శుక్రవారం పాస్టర్ ఇసాక్ ఆధ్వర్యంలో తైలాభిషేక ఆరాధనలు జరుగుతున్నాయి. కార్యక్రమానికి క్రైస్తవ విశ్వాసులు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి క్రైస్తవ బోధనలు చేయడాన్ని అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య ఆందోళన తీవ్రతరం కావడంతో పట్టణ పోలీసులు వారిని శాంతింప చేశారు.

నేడు నిర్మాత తుమ్మలపల్లికి సత్కారం

పుట్టిన ఊరిలో సన్మానంపై రామ సత్యనారాయణ ఆనందం


నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ

పాలకొల్లు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ తెలుగు సారస్వత పరిషత్ 4వ అంతర్జాతీయ లఘు చలన చిత్రాల పోటీలు సందర్భంగా తాను పుట్టిన గడ్డపై విశిష్ట ప్రతిభా పురస్కారం కార్యక్రమం ఏర్పాటు చేసిన సంస్థ కార్యవర్గ సభ్యులకు, పుర ప్రముఖులకు నా కృతజ్ఞతలు అని ప్రముఖ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 1957లో పాలకొల్లులో ఓ సామాన్య మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన రామ సత్యనారాయణ ఎన్నో సాహసాలు చేశారు. ఇప్పటి వరకూ 114 చిత్రాలను నిర్మించడంతో పాటు ఒకేసారి 15 చిత్రాల నిర్మాణం ప్రారంభించి 9 ప్రపంచ రికార్డుల్లో స్థానం దక్కించుకున్నారు. ఎంఎంకేఎన్ఎం హైస్కూల్లో ఉన్నత విద్య, ఏఎస్ఎన్ఎం కళాశాలలో డిగ్రీ చదివిన రామ సత్యనారాయణ కళలకు పుట్టినిల్లు అయిన పాలకొల్లు నుంచి సుమారుగా 75 మంది అతిరథ మహారథులలో సినీ ప్రపంచంలో ఒకరిగా నిలబడ్డారు. దాసరి, కోడి రామకృష్ణ, అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, కోరాడ చలం వంటి వారి సరసన నిలిచారు. రామ సత్యనారాయణ 2004లో సుమన్ హీరోగా 'ఎస్పీ సింహ' అనే చిత్రంతో నిర్మాతగా మారి 2004, 2005లో 13 చిత్రాలను నిర్మించారు. 20 ఏళ్ళగా 114 సినిమాలు నిర్మించి 2025 ఆగస్టు 15న ఒకే రోజు 15 చిత్రాలను ప్రారంభించడం సాహసం గానే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం జరిగే కార్యక్రమంలో విశేష ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు.

కనువిందు చేయనున్న రెడ్ మూన్

» రేపు రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం

» ఈ రాశుల వారు చూడకూడదు..

» రేపు మధ్యాహ్నం నుంచి శ్రీవారి ఆలయం మూసివేత



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 5(ఆంధ్ర జ్యోతి): ఈ నెలలో భాద్రపద మాసపౌర్ణమి రోజున అంటే ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుంది. దీనినే రాహుగ్రస్త చంద్రగ్రహణం అంటారు. శతభిష, పూర్వాషాడ నక్షత్రంలోనూ కుంభరాశిలో ఇది ఏర్పడుతుంది. కుంభ, సింహరాశివారు ఈ గ్రహణాన్ని చూడకూడదని పంచాంగకర్తలు చెబుతున్నారు. ముందు, వెనుక నక్షత్రాలైన ధనిష్ట, ఉత్తరాభాద్ర వారు కూడా చూడకూడదంటున్నారు. మేషం, వృషభం, కన్య, ధనుస్సు రాసుల వారికి ఈ గ్రహణం మంచిది. మకరం, మిథునం, తుల రాశులకు మిశ్రమ ఫలితాలు ఉన్నాయంటున్నారు.

ఆలయాల మూత..

గ్రహణ సమయానికి ముందే ఆలయాలు అన్ని మూసివేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రముఖ ఆలలయమైన ద్వారకాతిరుమల ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేస్తారు. ఆ రోజు మహానివేదన అనంతరం మధ్యాహ్నం గం.12.30 గంటలకు కవాట బంధనం జరుగుతుంది. ఆ మరునాడు అనగా 8న సోమవారం పుణ్యహవాచనం అనంతరం ఉ. 9.30 గంటల నుంచి భక్తులకు సర్వదర్శన అనుమతి లభిస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు సూచించారు. ఈ సందర్భంగా 7న సాయంత్రం శ్రీవారికి జరిగే ఆర్జిత సేవలు, 8న ఉదయం సుప్రభాతసేవలు రద్దు అవుతాయని మిగిలిన అన్ని సేవలు యథాతథంగా జరుగుతాయని భక్తులు గమనించాలని అధికారులు కోరారు.

చంద్రగ్రహణం అంటే..

సూర్యుడు , భూమి, చంద్రుడు ఒకే సరళరేఖ లోకి వచ్చినప్పుడు భూమి సూర్యకాంతిని చంద్రునిపై పడకుండా అడ్డుకుంటుంది. అప్పుడు చంద్రుడు కన్పించడు. దీనినే చంద్రగ్రహణం అంటారు.

సూతక కాలం ఎప్పుడు..

ఆదివారం రాత్రి గం. 9.58 గంటల నుంచి గ్రహణం ప్రారంభం కానుంది. 1.26 గంటలకు పూర్తవుతుంది. గ్రహణ సమయం 3.28 గంటలు. ఈ చంద్రగ్రహణం రోజున చంద్రుడు ఎరుపు రంగులో ఉంటాడు అందుకే బ్లడ్ మూన్ అని అంటారు. చంద్రగ్రహణం ఏర్పడటానికి 9 గంటల ముందు సూతక కాలం మొదలవుతుంది. అంటే ఆదివారం మధ్యాహ్నం 12.57 గంటల నుంచి సూతక కాలం ప్రారంభమవుతుంది. ఈ సూతక కాలంలోనే ఆలయాల ద్వారాలు మూసివేస్తారు. పూజలు జరుగవు. గ్రహణం ముగిసిన తర్వాత ఆలయాలను, ఇంటిని శుభ్రం చేసుకుని పూజలు జరుపుతారు.

ఈ నియమాలు పాటించండి..

మధ్యాహ్నం 12.15 గంటల లోపే ఆహారం తీసుకోవాలి. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, బాలబాలికలు సాయంత్రం గం.6.25 గంటల వరకూ తీసుకోవచ్చని చెబుతున్నారు. గ్రహణం ముగిసేవరకూ ఆహారం తీసుకోకూడదు. ఆరోగ్యం సరిగా లేనివారు పాలు, పండ్ల రసాలు తీసుకోవచ్చు. అలాగే గ్రహణానికి ముందు వండిన ఆహారంపై దర్భ గడ్డి, తులసి వంటివి వేయడం వల్ల ఆహారం కలుషితం కాకుండా ఉంటుందన్నది నమ్మకం.

గ్రహణం తర్వాత ఇవి పాటించండి..

గ్రహణం ముగిసిన వెంటనే తలస్నానం చేసి శుభ్రమైన దుస్తులు ధరించాలి. ఇంటిని, పూజగదిని శుభ్రం చేయాలి. పేదలకు బట్టలు, ధాన్యం, ఆహారం శక్తి మేరకు డబ్బు దానం చేయాలి. సమీప ఆలయానికి వెళ్లి దైవదర్శనం చేసుకోవాలి. పట్టు, విడుపు స్నానాలు ఆచరించాలి. ఈ నియమాలు పాటించడం వల్ల గ్రహణం దుష్ప్రభావాలు దరిచేరవని నమ్మకం.

క్రైమ్ సమాచారం

ఆసుపత్రి భవనం నుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య

తణుకు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలోని సూర్యాలయం వీధిలోని హాస్య ఆసుపత్రి భవనం నుంచి దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని సుమారు 65 ఏళ్ల వయసు గల వృద్ధుడు ఆసుపత్రి భవనం నుంచి దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృత దేహాన్ని తణుకు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గర్భం దాల్చిన బాలిక.. కేసు నమోదు

ఏలూరుక్రైం,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఒక బాలికతో ఒక యువకుడు దూరపు బంధువుగా పరిచయం పెంచుకుని ఆమెను గర్భవతిగా చేశాడు. ప్రస్తుతం ఆ బాలిక పురుడు పోసుకోవడానికి ఒక ఆసుపత్రిలో చేరడంతో వైద్యులు ఎంఎల్‌సీగా నమోదు చేసి, పోలీసులకు సమాచారం అందించారు. ఏలూరు రూరల్ పరిధిలో ఒక గ్రామానికి చెందిన బాలిక(15) తల్లిదండ్రులు వేరే రాష్ట్రంలో పనుల నిమిత్తం వెళ్లారు. ఆ బాలిక అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. రెండేళ్ల నుంచి ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామానికి చెందిన మోరు దుర్గాప్రసాద్ దూరపు బంధువు కావడంతో, తరచుగా ఆ బాలిక వద్దకు వస్తూ వెళుతుండేవాడు. శారీరకంగా వారు ఒకటి కావడంతో బాలిక గర్భం దాల్చింది. ఆ బాలిక 9వ నెల గర్భిణీ కావడంతో ఏలూరులోని ఒక ఆసుపత్రిలో పురుడుపోయడానికి చేర్చారు. అక్కడి వైద్యులు ఎంఎల్‌సీ నమోదు చేసి, పోలీసులకు సమాచారం అందించడంతో ఏలూరు రూరల్ పోలీసుల బాధితురాలి నుంచి వాంగ్మూలాన్ని శుక్రవారం నమోదు చేసుకున్నారు.

చేపల సొమ్ము ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదు

పెదపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చేపల కొనుగోలు చేసి తనకు రావలసిన రూ.8,59,740 నగదు ఇవ్వకుండా మోసం చేశారంటూ పెదపాడు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన మోరు విజయ్‌బాబు పెదపాడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం విజయ్‌బాబుకు గుడిపాడు గ్రామంలో రెండు ఎకరాల చేపల చెరువు ఉండగా, అందులోని చేపలను అదే గ్రామానికి చెందిన జయమంగళ అనిల్‌కుమార్, మోరు నరసింహారావు, మోరు రవిబాబుకు అమ్మకం చేయగా వారు నగదు ఇవ్వకుండా మోసం చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాట్సాప్ మెసేజ్ ఓపెన్ చేస్తే రూ.50 వేలు గల్లంతు

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు రకరకాల విధానాలతో బ్యాంక్ ఖాతాల్లోని సొమ్మును కాజేస్తున్నారు. కేంద్రప్రభుత్వం, టెలికాం ఆపరేటర్ల ద్వారా డయల్ టోన్‌గా వీరిపట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినా, చదువుకున్న వారు సైతం నేరగాళ్ళ వలలో ఇట్టే పడిపోతున్నారు. గురువారం సాయంత్రం ఉల్లంపర్రు ఐటీఐ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే కర్రెళ్ల వీర వెంకట రామాంజనేయులుకు వాట్సాప్ ద్వారా స్టేట్ బ్యాంక్ యూనో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని మూడుసార్లు మెసేజ్ రావడంతో సదరు కంప్యూటర్ ఆపరేటర్ మెసేజ్‌ను ఓపెన్ చేయగా తన ఖాతాలోని రూ.50 వేలు బదిలీ అయినట్టు మెసేజ్ రావ డంతో అవాక్కయ్యాడు. వెంటనే ఏటీఎంకు వెళ్లి తన ఖాతాలో ఉన్న రూ.42వేలు డ్రా చేసుకుని పాలకొల్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలైన లలితా సూర్యప్రకాష్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు మైనర్లు ప్రమాదవ శాత్తు బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఒక బాలుడు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెంకు చెందిన లలితా సూర్యప్రకాష్(15), డి.తారక రంగనాథ్‌లతో కలిసి బైక్‌పై శుక్రవారం ఉదయం వెళుతుండగా, ఆర్టీసీ బస్సు అతివేగం రావడంతో, భయంతో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో లలితా సూర్యప్రకాష్ కుడి మోకాలు నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనను ఎంఎల్‌సీ నమోదు చేసి, ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీస్‌లకు సమాచారం అందించారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

భీమవరం క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తన భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ మునిసిపల్ కాలనీకి చెందిన వర్రె గాయత్రీదేవి వన్‌టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గాయత్రీ దేవికి కిరణ్‌కుమార్ అనే వ్యక్తితో 2014లో వివాహమైంది. ఒక కుమారుడు జన్మించాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై భార్యను చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయి జాడ లేకుండా పోయాడు. ఆ మహిళ ఇంటి వద్ద కూడా లేడని తనకు న్యాయం చేయాలంటూ గాయత్రీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాత గొడవల నేపథ్యంలో దాడి

భీమవరం క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాత గొడవల నేపథ్యంలో తనపై నలుగురు దాడి చేసి గాయపరిచారంటూ బలుసుమూడికి చెందిన భూపతిరాజు మణికంఠ వర్మ టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 4వ తేదీన మణికంఠ వర్మ తన స్నేహితుడిని ఇంటి వద్ద దింపడానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో ముద్దే విజయసాయికుమార్, నాగబాబు, వంశీ, మరో మహిళ కలిసి మణికంఠవర్మపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని శివ అనే వ్యక్తి ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రామారావు తెలిపారు.

● అలాగే భోళా శంకర్, కారింకి ఆదిత్య, మణికంఠ వర్మ, నాగేశ్వరరెడ్డి, ముద్దే శివ అనేవారు పాత గొడవలను పురస్కరించుకుని తమపై దాడి చేశారంటూ ముద్దే విజయసాయి కుమార్, ముద్దే వాణి అనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కూడా శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

అల్లుడిని కొట్టిన అత్త మామలపై కేసు

టి.నరసాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లుడిని కొట్టి గాయపరిచిన అత్తమామలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. బంధంచర్ల గ్రామానికి చెందిన కిలారపు రవికుమార్‌కు వివాహమైంది. ఒక బాబు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన అత్తమామలు రాచప్రోలు నక్షత్రం, ప్రసాద్‌లతో కొంత కాలంగా గొడవపడుతున్నారు. ఈనెల 3న రవికుమార్ తన భార్యను తీసుకువెళ్లేందుకు అత్తవారింటికి రాగా.. అత్తమామలు తమ కుమార్తెను పంపించేది లేదని అల్లుడితో గొడవపడి మామ ఇటుకరాయితో మూతిమీద కొట్టగా, అత్త కళ్లల్లో పసుపుకొట్టింది. గాయపడిన అతడిని తండ్రి మద్ది రాముడు 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు శుక్రవారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు బెల్ట్ షాపుల నిర్వాహకుల అరెస్ట్

తణుకు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తేతలి గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న, బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. శుక్రవారం తణుకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది నిర్వహించిన దాడులలో దువ్వ గ్రామంలో ఇందుకూరి నాగరాజు, తేతలి గ్రామానికి చెందిన పంది గోగులు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టుగా గుర్తించారు. వారి వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడులలో ఎస్ఐ బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పెదవేగి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం న్యాయంపల్లిలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు శుక్రవారం దాడిచేసి, ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. వివరాలివి.. న్యాయంపల్లిలో పేకాట జరుగుతుందని సమాచారం రావడంతో పెదవేగి సీఐ సీహెచ్.రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి, ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.9,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ పేకాట, మద్యం అక్రమ రవాణా వంటి కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు డయల్ 112, సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

ప్రతీకార దాడి..

» ఏడాదిన్నర కిందట కుమారుడిని చంపాడని వ్యక్తిపై దాడి

» గాయాలతో బయటపడ్డ క్షతగాత్రుడు నాగేంద్రప్రసాద్

» కుటుంబ కలహాలే కారణమని గ్రామస్థుల వెల్లడి



పెదవేగి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : భోగాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం ఊరేగిస్తూ, నిమజ్జనానికి తీసుకెళుతున్నారు. ఇంతలో ఊరేగింపు మధ్య నుంచి భయంతో కూడిన కేకలు వేస్తూ ఓ వ్యక్తి పారిపోతున్నాడు. కత్తులతో ఇద్దరు వ్యక్తులు అతడిని వెంటాడారు. ముందు వెళ్తున్న వ్యక్తి చేతులు, తలకు తీవ్రగాయాలతో ఆ ఇద్దరిని తప్పించుకుని, ఊరేగింపు బందోబస్తులో ఉన్న పోలీసులకు చెప్పాడు. పోలీసులను చూసిన నిందితులిద్దరూ పరారయ్యారు. వివరాలివి.. పెదవేగి మండలం భోగాపురానికి చెందిన మండపాక నాగేంద్ర వరప్రసాద్ కుటుంబ కలహాల నేపథ్యంలో గతేడాది ఏప్రిల్ 22వ తేదీన అతడి సమీప బంధువైన పామర్తి రంగారావును చాకుతో పొడిచి హత్యచేశాడు. దీనిపై నిందితుడైన మండపాక నాగేంద్ర వరప్రసాద్ కొంతకాలం జైలులో ఉండి, బెయిల్‌పై బయటకు వచ్చాడు. అక్కడితో ఆగకుండా రంగారావు కుమారుడిని కూడా చంపేస్తానంటూ తిరుగుతున్నాడని రంగారావు తండ్రి రామచంద్రరావు పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్న ఒక్క మనుమడిని ఎక్కడ చంపేస్తాడోనని భయపడిన తాత పామర్తి రామచంద్రరావు, మనుమడు పవన్‌సాయిని హైదరాబాద్‌లో కొంతకాలం ఉంచాడు. చివరకు ఇటీవల తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు. కాగా శుక్రవారం సాయంత్రం గణేష్ ఊరేగింపు రామచంద్రరావు ఇంటి సమీపంలోకి వచ్చింది. ఆ ఊరేగింపులో మండపాక నాగేంద్ర వరప్రసాద్ ఉండడం చూసిన తాత రామచంద్రరావు, మనుమడు పవన్‌సాయి కత్తులు తీసుకుని, అతడిని హత్యచేయడానికి ప్రయత్నించారు. వారినుంచి తప్పించుకున్న అతడు పోలీసుల దగ్గరకు వెళ్లడంతో నిందితులిద్దరూ పరారయ్యారు. చేతులు, తలకు తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని బంధువులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.



జీలుగుమిల్లిలో ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

యూరియా కొరత లేదు : ఏవో జీవన సంధ్య

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలంలో యూరియా కొరత లేదని ఏవో ఎ.జీవనసంధ్య అన్నారు. మండలంలో చాటపర్రు, జాలిపూడి సొసైటీల్లో మొత్తం 25 టన్నుల యూరియా సరఫరా దిగుమతి అయిందని, వీటిని శుక్రవారం గొడౌన్లలో భద్రపరిచి ఆమె పరిశీలించి మాట్లాడారు. సొసైటీల్లో నిలువలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు కావాల్సినంత మేరకు యూరియా తీసుకువెళ్లి వినియోగించాలన్నారు. జాలిపూడి సొసైటీ ఛైర్మన్ ఎం.పవన్‌కుమార్, చుక్క వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధికి దాతల కృషి అభినందనీయం'

రూ.6.89 లక్షలతో ఎంఈవో కార్యాలయం ఆధునికీకరణ



ఎంఈవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండల విద్యాశాధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతలు కాకరాల రమేష్ జ్ఞాపకార్థం డాక్టరు చంద్రశేఖరరావు, విజయలక్ష్మి దంపతులు రూ.3.50 లక్షలు, సబ్బితి సావిత్రి జ్ఞాపకార్థం వారి కుమారుడు పెదపాడు ఎంఈవో సబ్బితి నరసింహమూర్తి రూ.1.25 లక్షలు, మండల ఉపాధ్యా యులు 2.14 లక్షలు మొత్తం రూ.6.89 లక్షలతో ఎంఈవో కార్యాలయాన్ని ఆధునికీకరించారు. దాతలను సత్కరించి వారికి జ్ఞాపికలు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ గారపాటి రామసీత, ఎంఈవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు గ్రామ శివారు రామచంద్రపురానికి చెందిన సారిపల్లి విజయ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద వచ్చిన నగదు రూ.2.49 లక్షల చెక్కును విజయ్ కుటుంబ సభ్యులకు వారి ఇంటివద్దకు వెళ్లి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అందజేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : రెడ్డి అప్పలనాయుడు

పెదవేగి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. రాట్నాలకుంట రాట్నాలమ్మను శుక్రవారం దర్శిం చుకున్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అరాచక పాలననుంచి విముక్తి పొందిన రాష్ట్ర ప్రజలు ఇప్పుడు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జనసేన నాయకులు రెడ్డి గౌరీశంకర్, సరిది రాజేష్, ధర్మేంద్ర, వాసా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రరావు పేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 2వ తేదీ నుంచి జరుగుతున్న స్వామివారి 24వ వార్షిక పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీవారి మూలవరులకు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, వేద పండితులు హోమాలు, పూర్ణాహుతి, పూజలు నిర్వహించారు. ఈవో నల్లూరి సతీష్‌కుమార్, సిబ్బంది గల్లా శ్రీనివాస్, పామర్తి గంగాధరరావు బృందం భక్తులకు ఏర్పాట్లు చేశారు. శ్రీవారి సేవా బృందం భక్తులు ప్రత్యేక సేవలు అందించారు.

'జీఎస్టీ సంస్కరణలు చరిత్రాత్మకం'



సత్యకుమార్

ఏలూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలు చరిత్రాత్మకమని వెస్ట్ గోదావరి ఏలూరు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం అసోసియేషన్ అధ్యక్షుడు ఎంటీవీ సత్యకుమార్ విలేకరులతో మాట్లాడారు. ఇది మరో చరిత్రాత్మక అడుగు అని, సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. నిత్యావసర వస్తువులపై పన్నులు గణనీయంగా తగ్గుతాయన్నారు. రైతులు, వ్యవసాయం, ఆరోగ్య రంగాలకు భారీగా లబ్ధి చేకూరనుందని తెలిపారు. రాయితీ పొందాలంటే ప్రస్తుతం ఉన్న ధరలను మార్పు చేసి అమ్మకాలు సాగేలా కేంద్రం చర్యలు తీసుకుని 22 నుంచి పటిష్ఠంగా జీఎస్టీ సంస్కరణలు అమలు చేయాలని కార్యదర్శి ఎస్.గురుప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా రైతులు పోరాడాలి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అనుగుణంగా మార్చే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం సంఘటితంగా పోరాడాలని ఏపీ రైతుసంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎం.నాగులపల్లిలో సంఘ మహాసభ నిర్వహించారు. రైతు ఉద్యమనేత అమరజీవి రుద్రరాజు సత్యనారాయణరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయం నష్టాల్లో ఉందని, రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడన్నారు. మెట్టరైతులకు సాగునీరందించాలని, జాతీయ రహదారికి ఎం.నాగులపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రైతు సంఘ మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రైతు సంఘనేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వేగంగా పోలవరం పునరావాసం

(5వ పేజీ తరువాయి)

26,946 ఉన్నాయి. వీటిలో 19,482 కుటుంబాలకు ప్యాకేజీ చెల్లించారు. మొదటి దశలోని 1బీలో 27,114 కుటుంబాలు ఉండగా, వాటిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పరిధిలోని కుమ్మరిలోవలో 472 కుటుంబాలకు ప్యాకేజీ చెల్లించారు. మొత్తం వీరికి రూ.1,212.95 కోట్లు చెల్లించారు. కానీ 1బీలో 2021లో వరద సమయంలో మరో 48 గ్రామాలు మునిగిపోయాయి. అవి వాస్తవానికి రెండో దశ అయిన 45.75 కాంటూరు పరిధిలో ఉన్నాయి. కానీ ముంపునకు గురికావడంతో వాటి కూడా మొదటి దశ 41.15 కాంటూరు పరిధిలోకి తెచ్చి, మొదటి దశ 1బీలో చేర్చి ప్యాకేజీ అమలు చేస్తున్నారు. కొత్తగా కలిసిన 48 గ్రామాలకు గాను 4 గ్రామాల్లో ప్రజలు లేరు. మిగిలిన 44 గ్రామాల పరిధిలోని ప్రజలకు ప్యాకేజీ అమలు చేస్తున్నారు. వాటిలో 32 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, వారికి రావలసిన మొత్తాన్ని నిర్ణయించి, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ ఆమోదం కోసం ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అధికారి కార్యాలయానికి పంపారు. ఇందులో కేఆర్ పురం యూనిట్ పరిధిలో 14 గ్రామాలు, చింతూరు యూనిట్ పరిధిలో 30 గ్రామాలు ఉన్నాయి. ఆమోదం వచ్చేస్తే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.6లక్షల 86వేల చొప్పున, ఇతరులకు రూ.6 లక్షల 36వేలు చొప్పున పరిహారం ఇస్తారు. ఇక చింతూరు కేఆర్ పురంలో లచ్చిరెడ్డిగూడెం, టేకూరు, చింతూరు పరిధిలో మరో 10 గ్రామాలకు ప్యాకేజీని సిద్ధం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు రెండో దశ 45.75 కాంటూరు వరకూ విస్తరించి ఉంది. ఆ పరిధిలో 201 గ్రామాలు, సుమారు 58వేల కుటుంబాలు ఉన్నాయి. ఇక మొదటి దశ 1ఏలో 26,946 కుటుంబాల కోసం 75 పునరావాస కాలనీలు నిర్మించాల్సి ఉంది. వాటిలో 26 పూర్తయ్యాయి. 49 కాలనీల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గతంలోనే టీడీపీ హయాంలోనే చాలా కాలనీల నిర్మాణం మొదలు పెట్టగా, తర్వాత వచ్చిన వైసీపీ వీటిని నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం పాత కాంట్రాక్టర్లను రద్దు చేసి, కొత్తగా టెండర్లు పిలిచింది. అవి ఖరారైన వెంటనే పనులు మొదలవుతాయి. మొదటి దశ ఆర్‌అండ్ ప్యాకేజీ అమలును వేగవంతం చేశామని పోలవరం ప్రాజెక్టు అధికారి అభిషేక్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. 32 గ్రామాల ప్యాకేజీ నివేదికలను ఆమోదానికి పంపామని, మిగతావి ఇంకో 15 రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు. ఆమోదం రాగానే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని తెలిపారు.

2,10,500

(5వ పేజీ తరువాయి)



ఆండ్రాయిడ్ ఈ-పోస్ మిషన్

ఆండ్రాయిడ్ ఈ-పోస్ మిషన్లు వస్తున్నాయని ఇక నుంచి వాటి ద్వారా రేషన్ డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారని జిల్లా పౌరసరఫరా శాఖాధికారులు చెబుతున్నారు. త్వరలో ఈ మిషన్లు అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు. ఇప్పటివరకు బ్లూటూత్‌కు కనెక్టు చేసుకుని ఆ ఈ-పోస్ మిషన్లు వినియోగించారు. అయితే కొత్త వెర్షన్‌లో వచ్చిన ఆండ్రాయిడ్ ఈ-పోస్ మిషన్లలో ఎన్నో ఆప్షన్లు ఉన్నాయి. వైఫై, హాట్ స్పాట్ ద్వారా ఇది పనిచేస్తుంది. ఇది పూర్తి ఆండ్రాయిడ్ వెర్షన్. ఈ మిషన్‌లో స్మార్ట్ రేషన్ కార్డు ఇన్‌సర్ట్ చేయ వచ్చు. ఆండ్రాయిడ్ మొబైల్‌కు కనెక్టు చేసుకోవచ్చు. గతంలో 2జీ, 3జీ సిమ్‌లకు మాత్రమే ఈ మిషన్లు పనిచేసేవి. ఇప్పుడు వచ్చే మిషన్లు 5జీ వెర్షన్‌కు పని చేస్తుంది. గతంలో ఎల్0 స్కానర్ వినియోగించారు. ఇప్పుడు ఎల్1 స్కానర్‌ను వినియోగిస్తారు. ఎల్ 1 స్కానర్ హై సెక్యూరిటీ వెర్షన్‌గా చెప్పవచ్చు. ఇది పూర్తి అప్‌డేట్ వెర్షన్ కావడంతో సర్వర్ సమస్యలు కూడా తగ్గే అవకాశాలున్నాయి.



ఏలూరులో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడేటి చంటి



ధర్మాజీగూడెంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సొంగా



ఏలూరు వైఎంహెచ్‌ఏ ప్రాంగణంలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు సన్మానం



జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

ఘనంగా గురుపూజోత్సవం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సన్మార్గంలో నడిపి సమాజంలో వారిని సమున్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేసే వ్యక్తే గురువని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆర్‌ఆర్.పేట బీసీఎంఎస్ కన్వెన్షన్‌హాలులో ఉపాధ్యాయ దినోత్సవం అపుస్మా ఆధ్వర్యంలో జరిగింది. ఉత్తమ ఉపాధ్యాయు లను ఎమ్మెల్యే బడేటి చంటి ఘనంగా సన్మానించారు. ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కో- ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

● ఎంపీ పుట్టా మహేశ్ కార్యాలయంలో గురుపూజోత్సవం సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

● పెదపాడు :పెదపాడులో ఎంఈవో సబ్బితి నరసింహామూర్తి అధ్యక్షతన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ గారపాటి రామసీత, గుత్తా అనిల్, బొప్పుడి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి/లింగపాలెం/కామవరపుకోట: చింతలపూడి ఎంపీడీవో కార్యాలయంలో గురుపూజోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొని పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. మానవత ఆధ్వర్యంలో మానవత కార్యాలయంలో పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఎం.ఎల్.కె.శ్రీనివాస్, మురళీకృష్ణ, పాండురంగారావు, బి.వి.ఎస్.ఎన్.రాజు, సాంబశివరావు, అనీల్‌కుమార్, షేక్ బాజీ, ఉపాధ్యాయులను సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులకు శాలువా కప్పి సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.వి.అప్పారావు, పి.అప్పలరాజు, రాజేంద్రప్రసాద్, పద్మశ్రీ, పి.ఎ.సుధాకర్‌లను సన్మానించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం అనన్య పాఠశాలలో జరిగిన టీచర్స్ డే కార్యక్రమంలో ఎమెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థుల నృత్యప్రదర్శనలు, ఉపన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కామవరపుకోట మండలం కామరవపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ కె.విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అధ్యాపకులను సత్కరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఐక్యూ ఎసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి/కొయ్యలగూడెం :జీలుగుమిల్లి ఎంఈవో కార్యాలయం వద్ద నిర్వహించిన గురుపూజోత్సవంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల ఉత్తమ ఉపాధ్యాయుల్ని ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు కె.శ్రీనివాస్, ఎస్.బుచ్చయ్య, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పసుపులేటి రాము, కూటమి నాయకులు గుడెల్లి లక్ష్మీనారాయణ, పద్దం వెంకటకృష్ణ, జయవరపు శ్రీరామూర్తి తదితరులు ఉన్నారు. కొయ్య లగూడెం మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ, మానవత ఆధ్వర్యంలోనూ గురువులకు సత్కారించారు. మానవత అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు సన్మానం చేశారు. రేపల్లివాడలోని మేదా పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానం చేసి మెమొంటోలు అందజేశారు.



ఏలూరు అమీనాపేటలోని సురేష్‌చంద్ర బహుగుణ స్కూల్లో టీచర్స్ డే వేడుకలు

విద్యార్థుల జీవితాలకు ఉపాధ్యాయులే ప్రేరణ : ఏఎస్పీ

ఏలూరుక్రైం, సెప్టెంబరు 5: విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేయడంలో ఉపాధ్యాయులు పోషించిన కీలకపాత్రను టీచర్స్ డే గుర్తు చేస్తుందని జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు అమీనాపేటలోని శ్రీ సురేష్‌చంద్ర బహుగుణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల దినోత్సవం ఒక వేడుక మాత్రం కాదని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు చేస్తున్న నిస్వార్థ సేవకు మనమిచ్చే గౌరవం అన్నారు. స్కూల్ హెచ్ఎం వి.స్రవంతి, జి.వరప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకు సన్మానం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 5, (ఆంధ్రజ్యోతి): దెందులూరు నియోజకవర్గ అపుస్మా ఆధ్వర్యంలో నాలుగు మండలాల ప్రైవేటు స్కూళ్ల టీచర్స్‌కు ఏలూరు వైఎం హెచ్ఏ ప్రాంగణంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కామన్‌బోర్డు ఎగ్జామినేషన్ సెక్రటరీ అంగులూరి సర్వేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా 68 మంది గురువులకు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. రాష్ట్ర అపుస్మా అధ్యక్షుడు కొలసాని తులసి విష్ణుప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడు జంగా బాలాజీ, ఎంబీఎస్ శర్మ, కోనేరు సురేష్‌బాబు, గుణ్ణం బుల్లబ్బాయి, శివకుమార్‌శర్మ తదితరులు ఉన్నారు.

జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కామవరపుకోట : ఉపాధ్యాయ దినోత్సవం, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పీఎంజేఎఫ్ లయన్ పి.విజయ్‌కుమార్‌రాజు జన్మదినం సందర్భంగా జీలకర్రగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీలకర్రగూడెం ప్రాథమిక పాఠశాల జీలకర్రగూడెంలో పనిచేసే 11 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. రీజనల్ ఛైర్‌పర్సన్ లయన్ ఆర్ఆర్ రత్నకుమారి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ ఎస్ఆర్ఆర్ రంగరాజు , కార్యదర్శి లయన్ మహేశ్వరి, మాజీ అధ్యక్షుడు లయన్ అల్లూరి పెద్దిరాజు, లయన్ రేగుంట సురేశ్, లయన్ బి. బాలవర్థిరాజు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన మహిళకే దక్కిన చింతలపూడి ఏఎంసీ ఛైర్మన్ పదవి

చింతలపూడి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఎట్టకేలకు జనసేన మహిళకు దక్కింది. దీంతో చింతలపూడి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎవరా? అనే ఉత్కంఠకు తెరపడింది. టీడీపీ నేతలు ఎన్నికల ముందు నుంచి తమకే వస్తుందని ఆశించారు. మంత్రులను, ఎంపీని ఆశ్రయించారు. జనసేన ఎన్నికల్లో తమకు పదవుల్లో హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకోవాలంటూ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇటీవల కాలంలో సొసైటీ త్రీమెన్ కమిటీల్లో తమకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చింతలపూడి ఏఎంసీ ఛైర్మన్ కోసం అభిప్రాయ సేకరణ జరిగింది. టీడీపీ మాజీ మంత్రి పీతల సుజాత నియోజకవర్గంలో పనిచేసినప్పుడు ఐదేళ్లలో ఏఎంసీ పదవి కోసం రెండు వర్గాలు విడిపోయి పోటీపడ్డాయి. అయినా ఐదేళ్ళల్లో ఎవరికీ దక్కలేదు. గత వైసీపీ హయాంలో మహిళకు ఈ ఛైర్మన్ పదవి కేటాయించారు. ఇక ఈసారి అటు జనసేన, ఇటు మహిళా ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని మండల జనసేన అధ్యక్షుడు చీదరాల మధుబాబు సతీమణి దుర్గాపార్వతికి పదవి దక్కింది. మధుబాబు, దుర్గాపార్వతి దంపతులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. వీరికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శాలువా కప్పి సన్మానించారు.



నిరసన దీక్షలో కూర్చున్న విద్యార్థి సంఘాల నాయకులు

బీసీ హాస్టళ్లను తరలించొద్దని నిరసన దీక్ష

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహాలు వేరే మండలాలకు తరలించవద్దంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. శుక్రవారం కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో నిరసన దీక్షలో కూర్చున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ బీసీ విద్యార్థులు వసతిగృహాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అద్దె ఇళ్లల్లో ఉండి చదువుకుంటున్నారన్నారు. కొయ్యలగూడెంలో ఉన్నటువంటి వసతిగృహాలు సక్రమంగా లేక విద్యార్థులు ఉండడంలేదని వాటికి మరమ్మతులు చేపట్టి మళ్లీ యథావిధిగా కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షకు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మద్దతు తెలిపారు. నిరసన దీక్షలో సీపీఐ మండల కార్యదర్శి ఆంజనేయరాజు, సమాఖ్యయాత్ సంస్థ అధ్యక్షుడు గంగిరెడ్ల సతీశ్, వెలగల నాని, మట్టా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు తెలియకుండా టీడీపీ గ్రామ కమిటీ ఏర్పాటు తగదు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 5 : (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థులకు సమాచారం లేకుండా టీడీపీ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం తగదని పి.రాజవరం నాయకులు పేర్కొన్నారు. ఇటీవల కొద్ది రోజులుగా టీడీపీ మండల నాయకులు స్థానికుల ప్రమేయం లేకుండా ఇష్టారాజ్యంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామస్థులకు తెలియకుండా సభ్యత్వకార్డులు ఆన్‌లైన్ చేసి గ్రామ కమిటీ ఏర్పాటు చేసి ప్రకటించారన్నారు. ఆ కమిటీకి తమకు ఎటువంటి సంబంధం లేదని రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా పరిశీలకులు గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. రాజీనామా చేసిన వారిలో గూడపాటి పుల్లయ్య, జాస్తి సత్యనారాయణ, ఉప్పులూరి శ్రీనివాసరావు, ఆతూకూరి సూరిబాబు, కొడవటి పవన్, తంగెళ్ల వెంకట్రావు, తాటి రాజు, బూరుగుపల్లి ప్రసాద్, కెల్ల దుర్గమ్మ, అన్నవరపు మహేష్, కొడవటి సత్యనారాయణ, జాస్తి హేమ, ఉండవల్లి రమేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చింతలపూడి,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి):చింతలపూడి మండలం వెలగలపల్లి వద్ద శుక్రవారం మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు వాహనాన్ని ఢీ కొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. వీరు చింతలపూడి నివాసులుగా చెబుతున్నారు. మెరుగైన చికిత్సకు ఏలూరు తరలించినట్టు సమాచారం. వివరాలు తెలియాల్సి ఉంది.



పోలవరంలో మిలాద్ ఉన్ నబి వేడుకల ర్యాలీ

భక్తిశ్రద్ధలతో 'మిలాద్ ఉన్ నబి'

ఏలూరు రూరల్/ఏలూరు టూటౌన్/ఏలూరు క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ముస్లింలు మిలాద్ - ఉన్ - నబీ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని శనివారపుపేటలోని మసీదులతోపాటు పలు గ్రామాల్లో ఉన్న చిన్న మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు జరిపారు. నగరంలో గన్ బజార్‌లోని రైల్వే గేటు మసీదులోను జిల్‌జిలా ఆస్థానంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మానవాళికి మహమ్మద్ ప్రవక్త జీవితం మార్గదర్శనీయమన్నారు. ప్రసాద వితరణ అనంతరం మధ్యాహ్నం శాంతి ర్యాలీ నిర్వహించారు. రజా-ఏ-ముస్తాఫ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలో పలు ప్రాంతాల మీదుగా కొనసాగింది. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ మానవాళి నడుచుకోవాల్సిన పద్ధతులు, గుణగణాలను మహ్మద్‌ప్రవక్త ఆచారణీయత్మకంగా వివరించారని అన్నారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ బాషా, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, అంజుమాన్ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ జావీదు, అబ్దుల్ రజాక్, కమిటీ గౌరవ అధ్యక్షులు మీర్జా జహీర్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ యాసిన్ షరీఫ్, పాల్గొన్నారు. శాంతి, సామరస్య వాతావరణంలో పండుగ వేడుకలు జరుపుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మిలాద్- ఉన్-నబీ ర్యాలీ నిర్వాహకులతో, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి, సమన్వయ సమావేశాన్ని ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇరువర్గాలు పోలీస్‌శాఖ సూచించిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, మిలాద్-ఉన్-నబీ ర్యాలీ నిర్వాహకులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

● పోలవరం/కామవరపుకోట : పోలవరం మండలంలో మిలాద్ ఉన్ నబి మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా అహెల్ సున్నత్ జమాతె ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో మండలంలో ప్రధాన రహదారులపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండి యాసీన్ షరీఫ్, సంధాని, షెహిన్షా బాషా, బాబు, కరీం, బాజి పాల్గొన్నారు. కావరపుకోట మండలంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపి ర్యాలీలు నిర్వహించారు.

బైబై.. గణేశా..

ఘనంగా గణనాథుల విగ్రహాల నిమజ్జనం



కృష్ణాపురంలో గణనాథుడి ఊరేగింపు

టి.నరసాపురం/చింతలపూడి/లింగపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో బంజార లంబాడీ సుగాలి సంక్షేమ సంఘం 24వ వార్షికోత్సవం పురస్కరించుకుని లంబాడీ నృత్యాలతో యువకులు, గ్రామపెద్దలు, మహిళలు వరసిద్ధి వినాయకస్వామి నిమజ్జన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మహి ళలు లంబాడి సంప్రదాయాలతో బిందెను తలపై పెట్టుకుని నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ధారవత్తు రమేశ్, రాధా దంపతులు, వరప్రసాద్, శ్రీలక్ష్మిల ఆర్థిక సాయంతో అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారి 50 కేజీల లడ్డూను వేలం పాటలో భూక్యా రమాకాంత్, నీరజ దంపతులు దక్కించుకున్నారు. చింతలపూడి పట్టణంలో శుక్రవారం కొప్పులవారి వీధి, ముతరాసులకాలనీలో ఏర్పాటు చేసిన చవితి మండపాలలో వినాయకుడిని ఊరేగించి తమ్మిలేరు రిజర్వాయరులో నిమజ్జనం చేశారు. క్రొప్పులవారివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో తొమ్మిది కిలోల లడ్డూను వేలం వేయగా రూ.13,600కు యాజలి విజయకుమార్ దంపతులు పాడుకుని లడ్డూను కైవసం చేసుకున్నారు. రాఘవాపురం గ్రామంలో గణేష్ మండపంలో రూ.48 లక్షల కరెన్సీని వినాయకుని చుట్టూ మండపాన్ని అలంకరించారు. లింగపాలెం మండలంలో తెలుగురైతు అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి ఉత్సవాలలో అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

● పెదవేగి: పెదవేగి బ్రహ్మంగారి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన భారీ వినాయకుని నిమజ్జనం వేడుకలు వైభవంగా నిర్వహించారు. పెదవేగిలో గ్రామ సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, సొసైటీ ఛైర్మన్ తాతా సత్యనారా యణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

●పెదపాడు : పెదపాడు రామచంద్రపురం గ్రామం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద శుక్రవారం మహా అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. రామాలయం యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు నాలుగు వేలమంది అన్న ప్రసాదాలు స్వీకరించారు.

నేడు నిమజ్జనాలు.. కరెంట్ నిలుపుదల

ఏలూరుకార్పొరేషన్:నగరంలోని పలు డివిజన్లలో శనివారం ఉత్సవ గణనాథులను ఊరేగింపు జరిపి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు భారీ సన్నాహాలు చేశారు. ఈ మేరకు శనివారం నగరంలో సాయంత్రం 3.30 నుంచి రాత్రి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రకృతి సేద్యంతో పర్యావరణానికి మేలు

పెదవేగి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సేద్యంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి చందు సత్తిబాబు అన్నారు. అమ్మపాలెంలో ప్రకృతి సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటలసాగులో రసాయనిక ఎరువుల వాడకానికి ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి మేలు చేసే అగ్నిఅస్త్రం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులందరూ రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని వదిలి ప్రకృతి సాగుకు మళ్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.స్వర్ణలత, నాగలక్ష్మి, కిరణ్‌కుమారి, కనకరత్నం, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత రాజు మృతి పార్టీకి తీరనిలోటు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జైనవారిగూడెంకు చెందిన సీపీఎం నాయకుడు మడివి రాజు మరణం పార్టీకి తీరని లోటని మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అన్నారు. శుక్రవారం నాయకులు రాజు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్థివదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలిలో రాజు చురుకైన పాత్ర పోషించేవాడని, డప్పు చేత పట్టుకుని అన్ని కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యేవాడన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం, మంతెన సీతారామ్, జిల్లా ఎ.రవి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నాయకులు పి.నాగేశ్వరరావు, తామా ముత్యాలమ్మ, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కొయ్యలగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కరెంటు సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. అచ్యుతపురం, రేపల్లెవాడ, కొయ్యలగూడెం పట్టణంలోని అశోక్‌నగర్, కన్నాపురంరోడ్డు, అంకాలగూడెం ఏరియాలో కరెంటు నిలుపుదల చేస్తామని తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

వేలేరుపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో ఒక పూరిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన వేలేరుపాడు మండలం రేపాక గొమ్ము గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన తెల్లం బాయమ్మ తన ఇంటిలో కట్టెల పొయ్యి వెలిగించి వంట చేసే క్రమంలో నిప్పురవ్వలు ఎగిసిపడి మంటలు చెలరేగటంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో వస్తువులు మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలాన్ని రెవెన్యూ అధికారులు సందర్శించి బాధితులకు ప్రభుత్వపరంగా సహాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యూరియా కొరత లేదు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):నూజివీడు డివిజన్‌పరిధిలో ఎక్కడా యూరియా కొరత లేదని, వ్యవసాయశాఖ సహాయసంచాలకులు జి.విద్యాసాగర్ అన్నారు. నూజివీడులో ఆయన మాట్లాడుతూ 2025ఖరీఫ్‌సీజన్‌లో రైతులకు ఎటువంటి ఎరువుల కొరతలేకుండా అవసరమైన స్టాక్‌ను అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని, గ్రామాల్లోని సొసైటీలలో, రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా నిర్వహించే మిలాద్ ఉన్ నబి కార్యక్రమాన్ని నూజివీడు పట్టణంలోని ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులను, దర్గాలను అలంకరించారు. మతపెద్దలు మహ్మద్ ప్రవక్త యొక్క మార్గాన్ని వివరించారు. ఈ సందర్భంగా ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు.

టైమ్ స్కేల్ అమలుపై.. ట్రిపుల్ ఐటీ నాన్ టీచింగ్ స్టాఫ్ హర్షం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలో నాన్ టీచింగ్ స్టాఫ్‌కు టైమ్‌స్కేల్ అమలుపరచటంపై ట్రిపుల్‌ఐటీ నాన్‌టీచింగ్ స్టాఫ్ హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో టైమ్‌స్కేల్‌కు సంబంధించి జీవో 5ను విడుదల చేయగా, ట్రిపుల్ ఐటీల్లోని నాన్ టీచింగ్ స్టాఫ్‌కు మాత్రం వాటిని వర్తింపచేయలేదు. ఈ నేపథ్యంలో ఆర్జీయూకేటీ పరిధిలో గల ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ స్టాఫ్ హైకోర్టును ఆశ్రయించగా, 2024లో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు టైమ్‌స్కేల్ అమలుపరిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. దీని పై జీవో 158ని విడుదల చేస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆర్జీయూకేటీ పరిధిలోని నాన్ టీచింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీలు ఏర్పడిన దగ్గర నుంచి టైమ్ స్కేల్ అమలు పర్వటంపై ఎదురు చూశామని, ప్రభుత్వ నిర్ణయం కారణంగా తమ జీతాలు రూ.7నుంచి రూ.10వేల వరకు పెరిగే అవకాశం ఉందని ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉన్నత విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, ఆర్జీయూకేటీ ఉన్నతాధికార బృందాలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టైమ్‌స్కేల్ పెంపుద్వారా ఆర్జీయూకేటీ పరిధిలో గల ఆర్కేవ్యాలీ, నూజివీడు క్యాంపస్‌లలో దాదాపు 42 మంది ఉద్యోగులు ప్రయోజనం పొందుతారని వారు ఆనందం వ్యక్తం చేశారు.

సోమవరం-బాసవరపుపాడు రోడ్డుకు మహర్దశ

రూ. 2 కోట్లతో రహదారి అభివృద్ధి

చాట్రాయి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం-ముసునూరు మండలం బాసవరపుపాడు గ్రామాల మధ్య రోడ్డుకు మహర్దశ రానున్నది. 3.28 కిలో మీటర్ల పొడవు ఉన్న ఈ మెటల్ రోడ్డు అభివృద్ధికి రూ. 2 కోట్లు నాబార్డు నిధులు మంజూరై టెండర్లు కూడా పూర్తి కావటంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. చాట్రాయి మండలం నుంచి ఏలూరు వెళ్ళేవారు, బాసవరపుపాడు తిరుపతమ్మ గుడికి వెళ్ళే భక్తులు ఈ రహదారిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. సుదీర్ఘ కాలంగా ఈ మెటల్ రోడ్డుకు మరమ్మతులు లేక గోతులమయంగా మారింది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా ఉండేది. ఈ రహదారి పక్కనే కొన్ని వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. సోమవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు యర్రోజు రామ్‌ప్రసాద్, గ్రామస్థులు గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి రోడ్డు పరిస్థితిని వివరించి నిధులు మంజూరు చేయాలని కోరగా, వెంటనే మంత్రి నాబార్డు నుంచి నిధులు మంజూరు చేయించారు. సోమవరం గ్రామ టీడీపీ నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ డెస్కుల వితరణ



ముసునూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోపవరం గ్రంథాలయానికి టీడీపీ యువనేత, సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేష్ రెండు కంప్యూటర్ డెస్కులు, కరెంట్ సామగ్రిని బహూకరించారు. జిల్లా గ్రంథాలయ శిక్షణ సంస్థ డిజిటల్ ఇన్‌క్లూజన్ కార్యక్రమంలో భాగంగా ఈ గ్రంథాలయానికి ఒక టి.వి, రెండు కంప్యూటర్లను ఇటీవల అందజేశారు. అయితే వీటి వినియోగానికి సంబంధించిన సామాగ్రి, కరెంట్ సౌకర్యం లేకపోవడంతో గ్రంథాలయ అధికారి అభ్యర్థన మేరకు గణేష్ సుమారు రూ. 15 వేలు విలువ గల రెండు డెస్కులతోపాటు కరెంట్ సామాగ్రిని వితరణ ఇచ్చి, వైరింగ్ చేయించారు. దీంతో గ్రంథాలయంలో టి.వి, కంప్యూటర్లు వినియోగంలోకి వచ్చాయి. గణేష్‌కు గ్రంథాలయ అధికారి సునీల్‌కుమార్, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

కాలినడకన ద్వారకా తిరుమలకు మహిళలు

చాట్రాయి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నరసాపురానికి చెందిన 10 మంది మహిళా భక్తుల బృందం శుక్రవారం కాలినడకన చాట్రాయి మీదుగా ద్వారకా తిరుమల చిన్న వెంకన్న దర్శనానికి వెళ్ళారు. శుక్రవారం రాత్రికి ద్వారకా తిరుమల చేరుకొని శనివారం స్వామిని దర్శించుకుంటామని, గతంలో కూడా పలు మార్లు కాలినడకన ద్వారకా తిరుమల వెళ్ళామని మహిళా భక్తులు చెప్పారు.



యలవర్తి కృష్ణమూర్తికి ఘన నివాళి

కలిదిండి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో శుక్రవారం ప్రజానాయకుడు యలవర్తి కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా యాదవ సంక్షేమ సంఘ నాయకులు, కూటమి నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన యలవర్తి కృష్ణమూర్తి చిరస్మరణీయుడని కొనియాడారు. మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, శ్రీనివాసరావు, నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రేటి శ్రీహరి, యాదవ సంఘ నాయకులు బికెఎం.నాని, బి.శ్రీనివాసరావు, నీలపాల భోగేశ్వరరావు, ఏసుబాబు, గోవింద్, కూటమి నాయకులు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, యార్లగడ్డ రవి కుమార్, చిట్టూరి రవీంద్ర, నల్లగోపుల చలపతిరావు, పేటేటి సత్యనారాయణ, తట్టిగోళ్ల నాంచారయ్య, నీలపాల సుబ్బయ్య పాల్గొన్నారు.

ఊరేగింపులో ఇరువర్గాల ఘర్షణ

ముగ్గురికి గాయాలు

కైకలూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఉద్రిక్తతకు చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి కైకలూరు కరగట్ట వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగు రోజుల క్రితం ఇరువర్గాల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. అప్పటి నుంచి ప్రతి రోజూ ఏదో ఒకచోట యువకులు గొడవపడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కరగట్ట ఆంజనేయస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ఊరేగింపు సందర్భంగా మరోసారి వివాదం రాజుకుంది. దీనితో వందలాది మంది యువకులు చేరుకుని రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. దీంతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు పెద్దఎత్తున మోహరించి ఇరువర్గాలను చెదరగొట్టారు. కొద్దిసేపటికి పోలీసులు ఆ ప్రాంతాన్ని అదుపులోకి తీసుకుని వినాయకుని నిమజ్జనానికి ఇబ్బందులు లేకుండా బందోబస్తు నిర్వహించారు. దీంతో జాతీయ రహదారి వెంబడి వినాయకుని ఊరేగింపుగా తీసుకువెళ్లి ఏలూరు రోడ్డులోని పోల్‌రాజ్ డ్రైన్లో నిమజ్జనం చేశారు. దారి పొడవునా పోలీసులు ఎక్కడికక్కడే బందోబస్తు నిర్వహించారు. గాయపడిన వారిలో ఇరువురు కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరొకరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఘనంగా గురు పూజోత్సవం

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసిన జేసీ ధాత్రిరెడ్డి



జేసీ ధాత్రిరెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న ఈదులగూడెం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు అంకం వెంకటేశ్వరరావు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా అత్యాధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఏఐ క్లాసులు, క్రాఫ్ట్ వృత్తుల్లో బోధనేతర రంగాల్లో విద్యార్థులకు అదనపు తర్ఫీదునిస్తున్న ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఏలూరు జడ్పీ మీటింగ్ హాలులో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పూజోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ భగవంతుని తర్వాత పూజించేది గురువుల నేనన్నారు. డీఈవో వెంకటలక్ష్మి మాట్లాడుతూ జీవిత పాఠాలు నేర్పించేది గురువులేనన్నారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అంద జేసి దుశ్శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయిన కలెక్టర్ వెట్రిసెల్వి సమాజానికి ఉత్తమ పౌరులను అందించే అనిర్వచనీయ పాత్రను పోషిస్తున్న ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని తన సందేశంలో పేర్కొన్నారు.విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టు కున్నాయి. జిల్లా ఎస్పీ కిషోర్, జడ్పీ సీఈవో శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఎం.ఆర్.పెదబాబు, డీవైఈవోలు రవీంద్ర భారతి, సుధాకర్, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, ఎంఈవోలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆశ, ఫ్యాప్టో జిల్లా నాయకులు మోహన్, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, నారాయణ, ఆంజనేయులు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో అవార్డులు అందుకున్న వారు..

●స్కూల్ అసిస్టెంట్ కేటగిరీ..

బత్తుల అనూరాధ, బయోలాజికల్ సైన్స్, జడ్పీహెచ్ ఎస్, నూజివీడు. వల్లటూరి వెంకట సీతారామప్రసాద్, పీఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్, నూజివీడు. పంతగాని వీర కోటి, బయోలాజికల్ సైన్స్, జడ్పీహెచ్‌ఎస్, చను బండ, చాట్రాయి మండలం. ఆర్.వెంకట నాంచారయ్య, ఫిజిక ల్ సైన్స్, దొడ్డిపట్ల, కైకలూరు మండలం. టి. వెంకట అప్పారావు, ఇంగ్లీషు, జడ్పీహెచ్‌ఎస్, పుట్లచెరువు, మండవల్లి మండలం.

●ఎస్జీటీ కేటగిరీ..

సీహెచ్.కుసుమ కుమారి, ఎంపీపీఎస్, చావలిపాడు, మండవల్లి మండలం. ఎం.శ్రీనివాస రావు, ఎంపీపీఎస్, లింగాల (ఎఫ్ఎస్), మండవల్లి మండలం. పి.రాజ్యలక్ష్మి, ఎంపీ యూపీఎస్, వెలమ పేట, కైకలూరు మండలం. డి.గంగానమ్మ, ఎంపీపీ ఎస్, వేంపాడు, నూజివీడు మండలం. ఎ.వెంకటేశ్వర రావు, ఎంపీఎస్, ఈదులగూడెం, ఆగిరిపల్లి మండలం.



బి.అనూరాధ, వీవీఎస్ఆర్ ప్రసాద్, నూజివీడు



పి.వీరకోటి, చనుబండ, ఆర్.నాంచారయ్య, దొడ్డిపట్ల



టీవీ అప్పారావు, పులిచెరువు, సీహెచ్ కుసుమకుమారి, చావలిపాడు



ఎం. శ్రీనివాసరావు, లింగాల, రాజ్యలక్ష్మి, వెలంపేట



డి. గంగమ్మ, వేంపాడు



కైకలూరులో ప్రిన్సిపాల్ శ్రీలతకు సత్కారం



నూజివీడు త్రివిధలో ఉపాధ్యాయులకు సన్మానం



అయ్యవారి రుద్రవరంలో సర్వేపల్లికి నివాళి

గురువులకు సత్కారం



'హీల్' పాఠశాలలో జరిగిన గురుపూజోత్సవంలో పాల్గొన్న నూజివీడు డీఎస్పీ ప్రసాద్

ఆగిరిపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):బాలలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది, మార్గ నిర్దేశకులుగా తయారుచేసేది ఉపాధ్యాయులేనని నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్ అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం తోటపల్లి హీల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వందలాది మంది బాలబాలికలను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న హీల్ ఉపాధ్యాయ, కార్యనిర్వహణ సిబ్బందిని ఆయన అభినందించారు. ఆగిరిపల్లి ఎస్సై కె.శుభశేఖర్, హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ యార్లగడ్డ లతా, వైస్ ప్రిన్సిపల్ మిక్కిలినేని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీ డు త్రివిధ పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. సీనియర్ హిందీ ఉపాధ్యాయుడు రామకృష్ణ చేతులమీదుగా పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులైన కాత్యాయినీ, జయశ్రీ, రజినీ, రాజ్యలక్ష్మి, రేణుకలను సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులకు క్రీడాపోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి వికాస్ స్కూల్‌లో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను తల్లిదండ్రులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మండవల్లి: మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం విచ్చేడు ఆధ్వర్యంలో చిన్నారులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల తోనే విలువలు కూడిన సమాజం సాధ్యపడుతుందని తెలిపారు. గురువు లేని విద్య నిస్సార్థమవుతుందని వివరించారు. విద్యా కమిటీ సభ్యులు పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

కైకలూరు: విద్యార్థి జీవితంలో గురువుల స్థానం అత్యంత ప్రధానమైనదని ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీలత అన్నారు. శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ప్రిన్సిపాల్ వై శ్రీలతను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేగంగా పోలవరం పునరావాసం

(5వ పేజీ తరువాయి)

26,946 ఉన్నాయి. వీటిలో 19,482 కుటుంబాలకు ప్యాకేజీ చెల్లించారు. మొదటి దశలోని 1బీలో 27,114 కుటుంబాలు ఉండగా, వాటిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పరిధిలోని కుమ్మరిలోవలో 472 కుటుంబాలకు ప్యాకేజీ చెల్లించారు. మొత్తం వీరికి రూ.1,212.95 కోట్లు చెల్లించారు. కానీ 1బీలో 2021లో వరద సమయంలో మరో 48 గ్రామాలు మునిగి పోయాయి. అవి వాస్తవానికి రెండో దశ అయిన 45.75 కాంటూరు పరిధిలో ఉన్నాయి. కానీ ముంపునకు గురికావడంతో వాటి కూడా మొదటి దశ 41.15 కాంటూరు పరిధిలోకి తెచ్చి, మొదటి దశ 1బీలో చేర్చి ప్యాకేజీ అమలు చేస్తున్నారు. కొత్తగా కలిసిన 48 గ్రామాలకు గాను 4 గ్రామాల్లో ప్రజలు లేరు. మిగిలిన 44 గ్రామాల పరిధిలోని ప్రజలకు ప్యాకేజీ అమలు చేస్తున్నారు. వాటిలో 32 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, వారికి రావలసిన మొత్తాన్ని నిర్ణయించి, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ ఆమోదం కోసం ధవళేశ్వరం లోని పోలవరం ప్రాజెక్టు అధికారి కార్యాలయానికి పంపారు. ఇందులో కేఆర్ పురం యూనిట్ పరిధిలో 14 గ్రామాలు, చింతూరు యూనిట్ పరిధిలో 30 గ్రామాలు ఉన్నాయి. ఆమోదం వచ్చేస్తే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.6లక్షల 86వేల చొప్పున, ఇతరులకు రూ.6 లక్షల 36వేలు చొప్పున పరిహారం ఇస్తారు. ఇక చింతూరు కేఆర్ పురంలో లచ్చిరెడ్డిగూడెం, టేకూరు, చింతూరు పరిధిలో మరో 10 గ్రామాలకు ప్యాకేజీని సిద్ధం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు రెండో దశ 45.75 కాంటూరు వరకూ విస్తరించి ఉంది. ఆ పరిధిలో 201 గ్రామాలు, సుమారు 58వేల కుటుంబాలు ఉన్నాయి. ఇక మొదటి దశ 1ఏలో 26,946 కుటుంబాల కోసం 75 పునరావాస కాలనీలు నిర్మించాల్సి ఉంది. వాటిలో 26 పూర్తయ్యాయి. 49 కాలనీల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గతంలోనే టీడీపీ హయాం లోనే చాలా కాలనీల నిర్మాణం మొదలు పెట్టగా, తర్వాత వచ్చిన వైసీపీ వీటిని నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం పాత కాంట్రాక్టర్లను రద్దు చేసి, కొత్తగా టెండర్లు పిలిచింది. అవి ఖరారైన వెంటనే పనులు మొదలవుతాయి. మొదటి దశ ఆర్‌అండ్ ప్యాకేజీ అమలును వేగవంతం చేశామని పోలవరం ప్రాజెక్టు అధికారి అభిషేక్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. 32 గ్రామాల ప్యాకేజీ నివేదికలను ఆమోదానికి పంపామని, మిగతావి ఇంకో 15 రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు. ఆమోదం రాగానే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అవుతుందని తెలిపారు.



స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

కలిదిండి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మూల్లంక - పెదలంక ప్రధాన రహదారిపై పెద్ద గోతులు పడి అధ్వాన్నంగా ఉండటంతో బస్సుల రాకపోకలు నిలుపుదల చేయటంతో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. దీంతో రైతులు స్వచ్ఛందంగా రహదారిపై పడిన గోతులను ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి కంకరతో పూడ్చుతున్నారు. బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా మూల్లంక నుంచి పెదలంక వరకు 7 కిలోమీటర్ల మేర రోడ్లు మరమ్మతులు చేస్తున్నామని రైతులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు రహదారి మరమ్మతులు పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా గణనాథుల ఊరేగింపు



చాట్రాయిలో గణేష్ ఊరేగింపు

ముసునూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముసునూరు బీసీ కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పదో రోజు శుక్రవారం మహా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో 11వరోజు శనివారం ఉదయం శ్రీ కృష్ణ సమాజం కోలాట ప్రదర్శన, స్వామివారి లడ్డు ప్రసాదం వేలం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమాధాన ఏర్పాటు చేశామని నిర్వాహకులు మంగిశెట్టి పవన్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి స్వామివారి ఊరేగింపు అనంతరం నిమజ్జనం జరుగుతుందన్నారు.

ముదినేపల్లి: శ్రీహరిపురంలోని గణేష్ మండపం వద్ద మహిళలు దీపోత్సవం నిర్వహించారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఉత్సవాల నిర్వాహకులు నీలం సుబ్బారావు దంపతులు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, షిర్డి సాయిబాబా మందిర వైస్ చైర్మన్ నీలం నరసింహారావు తదితరులు పూజలు జరిపారు. గురజలోని గణేష్ మండపంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఉప సర్పంచ్ సాయి, జనసేన నాయకులు అబ్బిశెట్టి నాగబాబు, పోకల కృష్ణ, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ తదితరులు పూజలు జరిపి అన్నసమారాధన పాల్గొన్నారు. కాకరవాడ, సింగరాయపాలెం, బొమ్మినంపాడు, వాడవల్లి తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు జరిగాయి.

చాట్రాయి: చాట్రాయిలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని గురువారం విచిత్ర వేషధారణలు, తీన్మార్ వాయిద్యాలతో వైభవంగా ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ బాణసంచా కాలుస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఇంటి వద్ద భక్తులు స్వామికి పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ జరిగింది.

నూజివీడు టౌన్: నూజివీడు మండలం దిగవల్లి రామాలయం వద్ద, పోతురెడ్డిపల్లి, నూజివీడు పట్టణంలోని పలు కూడళ్ళల్లో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహాలను ఘనంగా ఊరేగించి నిమజ్జనాలు చేశారు.

ఆగిరిపల్లి:ఆగిరిపల్లిలోని శోభనాద్రి లక్ష్మీనరసింహ స్వామి వేద పాఠశాలలో పూజలు అందుకున్న మట్టి గణపయ్యను ఘనంగా నిమజ్జనం చేశారు. హైదరాబాద్‌కు చెందిన సూరి శోభనాద్రిశర్మ దంపతులు ఉభయ దాతలుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎడ్లబండి పై ఊరేగింపుగా తీసుకువెళ్ళి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి సూరిశర్మ, వేద పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. కలిదిండి సెంటర్‌లో వినాయకుడి మండపంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ మారుతి ప్రసన్న, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, బోయిన గోవింద్, ఏసుబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముదినేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి-సింగరాయపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని స్థానిక 11 కేవీ ఫీడర్‌లో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల తొలగింపు పనులను నిర్వహిస్తున్నందున సింగరాయపాలెం, చేవూరు గ్రామాల పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

కైకలూరు: విద్యుత్ లైన్లకు దగ్గర్లో ఉన్న చెట్టుకొమ్మలను తొలగించేందుకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కైకలూరు మండలం పల్లెవాడ సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలు మూసివేత

కైకలూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన చంద్రగ్రహణం సందర్భంగా కైకలూరు మండలంలోని ఆలయాలు మూసివేస్తున్నారు. కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారు, మీసాల వేంకటేశ్వరస్వామి, వరహాపట్నం శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం 10గంటల వరకు మూసివేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి వివిఎన్‌కె శేఖర్ తెలిపారు. అలాగే కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయం చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3గంటల నుండి సోమవారం ఉదయం 9 గంటల వరకు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.

ముదినేపల్లి: చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 7న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మరుసటి రోజు ఉదయం 8.30 గంటల వరకు ముదినేపల్లి మండలంలోని అన్ని ఆలయాలను మూసివేయనున్నట్లు ఆయా ఆలయాల ఈవోలు తెలిపారు. సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సంప్రోక్షణ అనంతరం మరుసటిరోజు ఉదయం 9 నుంచి భక్తుల దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ఏసీ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు.

ప్రభుత్వ నిర్వాకంతో నష్టపోతున్న రైతులు : మేకా

నూజివీడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేతకాని తనంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆరోపించారు. నూజివీడులోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ సీజన్ ప్రారంభానికి ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం కేవలం సొసైటీలకు మాత్రమే యూరియాను సరఫరా చేస్తున్నామని చెప్పడంతో ఎరువులు దొరక్క రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మరో వైపు కూటమి ప్రభుత్వ వైఖరితో నూజివీడు మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

2,10,500

(5వ పేజీ తరువాయి)



ఆండ్రాయిడ్ ఈ పోస్ మిషన్

ఆండ్రాయిడ్ ఈ-పోస్ మిషన్లు వస్తున్నాయని ఇక నుంచి వాటి ద్వారా రేషన్ డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారని జిల్లా పౌరసరఫరా శాఖాధికారులు చెబుతున్నారు. త్వరలో ఈ మిషన్లు అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు. ఇప్పటి వరకు బ్లూటూత్‌కు కనెక్టు చేసుకుని ఆ ఈ-పోస్ మిషన్లు వినియోగించారు. అయితే కొత్త వెర్షన్‌లో వచ్చిన ఆండ్రాయిడ్ ఈ-పోస్ మిషన్లలో ఎన్నో ఆప్షన్లు ఉన్నాయి. వైఫై, హాట్ స్పాట్ ద్వారా ఇది పనిచేస్తుంది. ఇది పూర్తి ఆండ్రాయిడ్ వెర్షన్ . ఈ మిషన్‌లో స్మార్ట్ రేషన్ కార్డు ఇన్‌సర్ట్ చేయవచ్చు. ఆండ్రాయిడ్ మొబైల్‌కు కనెక్టు చేసుకోవచ్చు. గతంలో 2జీ, 3జీ సిమ్‌లకు మాత్రమే ఈ మిషన్లు పనిచేసేవి. ఇప్పుడు వచ్చే మిషన్లు 5జీ వెర్షన్‌కు పనిచేస్తుంది. గతంలో ఎల్0 స్కానర్ వినియోగించారు. ఇప్పుడు ఎల్1 స్కానర్‌ను వినియోగిస్తారు. ఎల్ 1 స్కానర్ హై సెక్యూరిటీ వెర్షన్‌గా చెప్పవచ్చు. ఇది పూర్తి అప్‌డేట్ వెర్షన్ కావడంతో సర్వర్ సమస్యలు కూడా తగ్గే అవకాశాలున్నాయి.